

షాద్‌నగర్ హోలీ వేడుకల్లో పాల్గొన్న సినీనటి హెబ్బా పటేల్

# రంగోత్సవ్

## షాద్ నగర్‌లో సినీనటి హెబ్బా పటేల్ సందడి

**షాద్‌నగర్, మార్చి 4, ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్‌లో ప్రముఖ సినీనటి హెబ్బా పటేల్ సందడి చేశారు. పట్టణంలో ఓ ప్రైవేట్ ఆర్గనైజేషన్ వారు ఏర్పాటుచేసిన పోలీస్ సంబరాలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విశిష్ట అతిథిగా స్థానిక యువ నేత కాంగ్రెస్ పార్టీ నాయకుడు కేకే కృష్ణ పాల్గొన్నారు. నటి హెబ్బా పటేల్‌కు హోలీని పురస్కరించుకొని స్వీట్స్ అందజేశారు. అనంతరం కాంగ్రెస్ యువ నాయకుడు కేకే కృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో సంప్రదాయపు వేడుకలను నింపే అచ్చమైన కేళి అని అన్నారు. పట్టణంలో రంగు ఉత్సవ్ పేరిట నిర్వహించిన హోలీ వేడుకలు ఈ ప్రాంతానికి ఎంతో వన్నె తెచ్చాయని అన్నారు. ఓ ప్రముఖ సినీ నటితో కార్యక్రమం ఏర్పాటు చేయడం మంచి పరిణామమనీ అన్నారు. తరతరాలుగా రంగులలో మునిగి తేలుతూ ప్రతి ఏటా హిందువులు ఎంతో ఉత్సాహంగా ఈ పండుగను జరుపుకుంటారని ఆయన అన్నారు.
అలాంటి పండుగను అందరినీ ఒకే వేదిక మీదకు చేర్చి నిర్వహించడం అభినందనీయమని నిర్వాహకులను ఆయన అభినందించారు. ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాలతో ఈ పండుగను జరుపుకొని సంప్రదాయాలకు వెలుగులు పంచాలని ఈ సందర్భంగా కోరారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వీరితోపాటు కాంగ్రెస్ భరో నాయకుడు గుట్ట రాజు తదితరులు ఉన్నారు.

## వైభవంగా పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ

**శామీర్‌పేట, మార్చి 4, ప్రభాతవార్త :** మూడుచింతలపల్లిలో శ్రీపెద్దమ్మ తల్లి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా జరిగిన పూజా కార్యక్రమంలో మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ పాల్గొన్నారు. బుధవారం మూడుచింతలపల్లి మున్సిపల్‌లో శ్రీపెద్దమ్మ ఆలయం అమ్మవారి విగ్రహాల ప్రతిష్ఠ సందర్భంగ యజ్ఞహోమాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జామ్ రవి, మాజీ ఎంపిపి బి.చంద్రశేఖర్‌యాదవ్, పలువురు కౌన్సిలర్లు, బిజెపి, బిఆర్‌ఎస్, కాంగ్రెస్ పలు పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎంపి ఈటల రాజేందర్



రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త

# ఇసుక తోడేళ్లు



## కాగ్నా నదిలో జెబిసిలతో తవ్వకాలు

- అనుమతులు లేకుండా రాత్రి వేళలో రవాణా
- బొంకూరు రైల్వే గేటు సమీపంలో డంప్
- ఇసుక మాఫియాకు అడ్డాగా మారిన మంబాపూర్
- పోలీసు చెక్‌పోస్టు తీసేయడంతో యథేచ్ఛగా దందా
- ట్రాక్టర్ రూ.7 వేల వరకు విక్రయం
- ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి
- అడపా దడపా టాస్క్‌ఫోర్స్ దాడులు
- అడ్డుకట్ట వేయడంలో స్థానిక అధికారులు విఫలం

**పెద్దేముల్, మార్చి 4, ప్రభాతవార్త:** అక్రమ ఇసుక రవాణాలో ఇసుకాసురులు పెట్రెగిపోతున్నారు. రాత్రి పగలు తేడా లేకుండా ఇష్టానుసారంగా దర్జాగా ఇసుకను తరలిస్తున్నారు. రాత్రింబవళ్ళు అక్రమ ఇసుక రవాణాతో కంటికి కునుకులేకుండా పోతోందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. రాత్రి వేళలో ఒకదాని వెనుక ఇసుక ట్రాక్టర్లు వెళ్లడం చూస్తే ఏరువాక బండ్లను తలపిస్తున్నాయి. పెద్దేముల్ మండలంలోని రుక్మాపూర్ సమీపంలో గల బొంకూరు కాగ్నానది నుంచి జెసిబిలతో అక్రమంగా ఇసుకను తోడేస్తున్నారు. వాగు నుంచి తోడేసిన ఇసుకను బొంకూరు రైల్వే గేటు సమీపంలో డంపులుగా వేసి నిల్వచేస్తున్నారు. డంపులుగా వేసిన ఇసుకను రాత్రి వేళలో దర్జాగా తరలిస్తు సొమ్ము చేసుకుంటున్నారు. ఫిబ్రవరి మొదటి వారం నుంచి తవ్వకాలు మొదలయ్యాయి. రోజుకు 50 నుంచి 60 ట్రిప్పులు చొప్పున ట్రాక్టర్లతో ఇసుక తరలిస్తున్నారు. కేవలం రాత్రి వేళల్లో మాత్రమే మిగతా 2లో



రాత్రి వేళలో ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్



బొంకూరు రైల్వే గేటు సమీపంలో డంప్ చేసిన దృశ్యం

**'చెక్' పెడతా : తహసీల్దార్**

ఇసుక అక్రమ రవాణాపై తహసీల్దార్ వెంకటేశ్‌ప్రసాద్‌ను వివరణ కోరగా.. తన దృష్టికి రాలేదని చెప్పారు. విచారణ చేసి ఇసుక తరలింపులు అడ్డుకునేందుకు మంబాపూర్‌లో చెక్‌పోస్ట్ ఏర్పాటు చేస్తామని తెలిపారు.

# 99 రోజులు స్పెషల్ డ్రైవ్

- రేపటి నుంచి ప్రగతి ప్రణాళిక-కార్యాచరణ ప్రారంభం
- 15 వరకు పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వ కార్యాలయాలలో ఫైళ్ల క్లియరెన్స్
- ఏప్రిల్ 13 నుంచి 18 వరకు ఆరోగ్య శిబిరాలు, సురక్షిత రవాణాపై అవగాహన
- 20 నుంచి 25 వరకు సంక్షేమ శాఖలు, ఇందిరమ్మ పథకం అమలుపై ఫోకస్
- 27 నుంచి మే 2 వరకు డ్రగ్స్ నిర్మూలనపై దృష్టి
- మే 4 నుంచి 9 వరకు వ్యవసాయ అంశాలపై సమీక్షలు
- 11 నుంచి16 వరకు పాఠశాలల మౌలిక వసతులు
- 18 నుంచి 23 వరకు క్రీడా పోటీలు
- 25 నుంచి మే 30 వరకు మహిళా సాధికారత
- జూన్ 1 నుంచి 12 వరకు పర్యావరణ పరిరక్షణ
- తొలి రోజు ఉమ్మడి జిల్లా స్థాయిలో మంత్రుల సమీక్ష
- అన్ని వివరాలతో సిద్ధం కావాలని అధికారులకు కలెక్టర్ ఆదేశం

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ప్రభాతవార్త :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ను సమర్థవంతంగా అమలు చేయాలని, పాఠశాలలు, రెసిడెన్సియల్ స్కూల్స్, వసతి గృహాలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జిల్లాలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా బుధవారం వీడియో కాన్ఫరెన్సు హాలులో అదనపు కలెక్టర్ రాజేశ్వరి, అదనపు కలెక్టర్ సుదీర్‌లతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మార్చి 6 నుండి జూన్ 12 వరకు వివిధ అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నామని తెలిపారు. మార్చి 6 నుండి మార్చి 15 వరకు పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వ కార్యాలయాలలో ఫైళ్ల పరిష్కరణ అంశంపై ప్రత్యేక డ్రైవ్ చేపట్ట నున్నట్లు తెలిపారు. కార్యాలయాల పరిశుభ్రత, పెండింగ్ ఫైళ్ల వేగవంతమైన పరిష్కారం, రికార్డుల సక్రమ నిర్వహణ, ప్రజలకు సమయా నుకూల సేవలందించడం లక్ష్యంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాలు, మున్సిపాలిటీలలో తడి,పొడి చెత్త వేరు సేకరణ, పిచ్చి మొక్కల తొలగింపు, బహిరంగ ప్రదేశాల్లో చెత్త నిర్మూలన, ప్రభుత్వ భవనాల శుభ్రత కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని సూచించారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దీపక్ తివారి

ఏప్రిల్ 6 నుండి ఏప్రిల్ 11 వరకు ఆరోగ్యం, ఆరోగ్యకరమైన ప్రారంభాలు, ఆశాజనకమైన భవిష్యత్తులు అంశంపై ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరాలు, వైద్య పరీక్షలు, గర్భిణీలు, చిన్నారులకు ప్రత్యేక పర్యవేక్షణ, పోషకాహార అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడతాయని తెలిపారు.
ఏప్రిల్ 13 నుండి ఏప్రిల్ 18 వరకు సురక్షితంగా చేరుకోండి కార్యక్రమం, రవాణా శాఖల ఆధ్వర్యంలో నిర్వహించబడుతుందని తెలిపారు. రోడ్డు భద్రతపై అవగాహన, ట్రాఫిక్ నియమాల కఠిన అమలు, హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగంపై ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. ఏప్రిల్ 20 నుండి ఏప్రిల్ 25 వరకు సంక్షేమం అంశంపై ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖలు, ఇందిరమ్మ ఇల్లు పథకం అమలు స్థితిపై సమీక్షలు నిర్వహించి, లబ్ధిదారులకు పథకాల ప్రయోజనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.
ఏప్రిల్ 27 నుండి మే 2 వరకు పిల్లల భద్రత మరియు రక్షణ, డ్రగ్స్‌కు నో కార్యక్రమం పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాల రూపంలో అమలు చేయబడుతుందని చెప్పారు.
మే 4 నుండి మే 9 వరకు రైతులు, వ్యవసాయం అంశంపై వ్యవసాయ, రెవె న్యూ, నీటిపారుదల, విద్యుత్ శాఖలు సమన్వయంతో రైతులకు సాగు సలహాలు, ఎరువులు, విత్తనాల లభ్యత, సాగునీటి సరఫరా, నిరంతర విద్యుత్ సరఫరా అంశాలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.
మే 11 నుండి మే 16 వరకు విద్య అంశంపై పాఠశాలల మౌలిక వసతులు, పరిశుభ్రత, విద్యార్థుల హాజరు, బోధన నాణ్యతపై సమీక్షలు నిర్వహించబడతాయని తెలిపారు.
మే 18 నుండి మే 23 వరకు యువత మరియు క్రీడలు అంశంపై క్రీడా పోటీలు, యువజనోత్సవాలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణలు చేపట్టాలని సూచించారు.
మే 25 నుండి మే 30 వరకు మహిళలు అంశంపై మహిళా సాధికారత, స్వయం ఉపాధి, స్వయం సహాయక సంఘాల బలోపేతం, రుణాల సద్వినియోగంపై చర్యలు చేపట్టాలని ఆదేశించారు.
జూన్ 1 నుండి జూన్ 12 వరకు పర్యావరణం అంశంపై వృక్షారోపణ, ప్లాస్టిక్ నియంత్రణ, పచ్చదనం పెంపు కార్యక్రమాలు నిర్వహించబడతాయని తెలిపారు.
ఈ 99 రోజుల కార్యాచరణ గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో ఐదు దశల్లో అమలు చేయబడుతుందని తెలిపారు. మార్చి 6న ఉమ్మడి జిల్లా స్థాయిలో కార్యాచరణపై మంత్రుల సమీక్ష సమావేశం నిర్వహించబడుతుందని వెల్లడించారు. సంబంధిత శాఖల అధికారులు పూర్తి వివరాలతో సిద్ధంగా హాజరుకావాలని ఆదేశించారు. మార్చి 6 నుండి 16 వరకు నిర్వహించ ఎన్న పరిశుభ్రత కార్యక్రమాలపై ప్రత్యేక దిశానిర్దేశం చేస్తూ ప్రతి గ్రామం, మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, బస్టాండ్లు, రహదారుల వెంట పిచ్చి మొక్కల తొలగింపు, చెత్త నిర్మూలన, తడి,పొడి చెత్త వేరు సేకరణ ు సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. మిగతా 2లో



బస్తీ దవాఖానలో తనిఖీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్

# మూడు నెలలుగా డాక్టర్ డుమ్మా?

- కొడంగల్ బస్తీ దవాఖానాలో నిర్లక్ష్యం
- హాజరు రిజిస్టర్ కూడా మాయం!
- మున్సిపల్ చైర్మన్ తనిఖీలో వెలుగుజూసిన దారుణాలు
- డిఎంహెచ్‌ఓకు ఫోన్‌లో ఫిర్యాదు
- హాజరు లేకుండా జీతాలు ఎలా ఇస్తున్నారని ఆగ్రహం
- వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశం

**కొడంగల్, మార్చి 4, ప్రభాతవార్త :** కొడంగల్ మున్సిపల్ పరిధిలోని బస్తీ దవాఖానాలను మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్, కమిషనర్ బలరాంనాయక్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పట్టణంలోని బాలాజీనగర్ కాలనీలోని బస్తీ దవాఖానలో ల్యాబ్ టెక్నిషియన్ ఒక్కరే విధుల్లో కనిపించారు. డాక్టర్ గురించి ఆరా తీయగా.. మరో బస్తీ దవాఖానలో ఉంటున్నారని సిబ్బంది తెలిపారు. అక్కడి కూడా వెళ్లి చైర్మన్ తనిఖీ చేశారు. అయితే డాక్టర్ అమృత విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గుర్తించారు. గత మూడు నెలలుగా దవాఖానాలో హాజరు రిజిస్టర్ కూడా లేకపోవడంతో మున్సిపల్ చైర్మన్ అసహనం వ్యక్తం చేశారు. వెంటనే డిఎంహెచ్‌ఓ, డిప్యూటీ డిఎంహెచ్‌ఓకు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. మూడు నెలలుగా దవాఖానాలో అటెండెన్స్ రిజిస్టర్ లేకపోతే వారికి వేతనాలు ఎలా ఇస్తున్నారని నిగ్గదీశారు. కనీసం సిబ్బంది విధులకు హాజరవుతున్నారో లేదో ఎలా తెలుస్తుందని ప్రశ్నించారు. ఈ విషయంపై వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు.



## మాజీ జడ్‌పిటిసి అనితకు డాక్టరేట్ ప్రదానం

**శామీర్‌పేట, మార్చి 4, ప్రభాతవార్త :** శామీర్‌పేట మండల మాజీ జడ్పీటిసి సభ్యురాలు ఎం.అనిత లాలయ్యకు ఏషియన్ ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ ఆమెకు గౌరవ డాక్టరేట్ అవార్డును అందజేశారు. మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలంలోని ఉప్పరిపల్లి గ్రామానికి చెందిన ఆమె సామాజిక కార్యకర్తగా అభివృద్ధిలో తనదైన శైలిని ప్రదర్శించారు. ఎంతో మందికి చేయూత నిస్తూ బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఉపాధి, రాజకీయ రంగంలో సేవలు అందించారు. ఈ నేపథ్యంలో తమిళనాడులోని హోసూరులో కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ బృందం ఇటీవల ఈ పురస్కారాన్ని ప్రదానం చేసినట్లు మహంకాళి అనిత తెలిపారు. ఎం.అనితలాలయ్యకు ఈ పురస్కారం దక్కటం పట్ల వివిధ వర్గాలకు చెందిన స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ డాక్టరేట్ అవార్డు రావడం మరింత ఉత్సాహాన్నిచ్చిందని, ఇక ముందు కూడా మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

## ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన అధికారులపై చర్యలు తీసుకోండి

### కలెక్టర్‌కు బిఆర్‌ఎస్ నేత ఫిర్యాదు

**రంగారెడ్డి అర్బన్, మార్చి 4, ప్రభాతవార్త :** ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ప్రక్రియలో నిబంధనలను ఉల్లంఘించిన రిటర్నింగ్ అధికారి (ఆర్‌డీఓ) అనంతరెడ్డిపై చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్, సిపి సుధీర్ బాబుకు ఫిర్యాదు చేశారు. గత నెల 16, 17 తేదీల్లో జరిగిన ఎన్నికల ప్రక్రియలో పూర్తి స్థాయి కోరం ఉన్నప్పటికీ, కావాలనే జాప్యం చేస్తూ ఎన్నికను వాయిదా వేశారని ఆయన ఆరోపించారు. 15 మంది సభ్యులు మద్దతు తెలిపి సంతకాలు చేసినా, ఫోన్లో ఎవరితోనో మాట్లాడి ప్రక్రియను నిలిపివేయడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనన్నారు. ఈ వ్యవహారంపై హైకోర్టుకు కూడా తప్పుడు సమాచారం ఇచ్చారని, వీడియో రికార్డింగ్‌లను పరిశీలించి సదరు అధికారిని విధుల నుంచి తొలగించాలని ఆయన తన ఫిర్యాదులో కోరారు. ఈ ఫిర్యాదు ప్రతులను కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాలకు, సిఎస్ కు కూడా పంపినట్లు ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట బిఆర్‌ఎస్ సీనియర్ ఉన్నారు.

**ఎసిపిపై చర్యలు తీసుకోవాలి...**

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ ఎన్నికల్లో స్థానిక ఏ సి పి రాజు ఎన్నికల నియమావళికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్‌కు బిఆర్‌ఎస్ నాయకుడు మంద సురేష్ బుధవారం ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో ఏసీపీ రాజు నిబంధనలకు తిలోదకాలిచ్చారని సురేష్ ఆరోపించారు. బీఆర్ఎస్ అభ్యర్థి టేకుల సుదర్శన్ రెడ్డిని కార్యాలయానికి పిలిపించి పోటీ నుంచి తప్పుకోవాలని ఒత్తిడి చేశారని, అభ్యర్థి ముత్యాల శ్యామల భర్త భాస్కర్‌ను నేరుగా బెదిరించారని పేర్కొన్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రంలోనే గెలిచిన అభ్యర్థులను కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వాలని ఏసీపీ మభ్యపెట్టారని, చైర్మన్ ఎన్నిక జరగాల్సిన ఫిబ్రవరి 16న కావాలనే అల్లర్లు సృష్టించేలా వ్యవహరించారని ఫిర్యాదులో వివరించారు.
నిబంధనల ప్రకారం ఎన్నిక జరగకుండా అడ్డుపడుతూ..రిటర్నింగ్ అధికారికి ఎస్‌హెచ్‌ఓ ద్వారా లేఖ ఇప్పించారని ఆరోపించారు. కోర్టు ఆదేశాల ప్రకారం పీఎస్‌కు తీసుకువచ్చిన వ్యక్తిని సైతం కాంగ్రెస్ నేతలతో మాట్లాడించి బెదిరింపులకు పాల్పడ్డారని సురేష్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తున్న ఏసీపీని వెంటనే విధుల నుంచి తొలగించి, మున్సిపల్ చైర్మన్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని ఆయన కోరారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఫారెస్ట్ అధికారి

## వన్యప్రాణులను సంరక్షిద్దాం

**మొయినాబాద్, మార్చ్ 4, ప్రభాతవార్త:** వన్యప్రాణులను ప్రతి ఒక్కరూ సంరక్షించాలని నేషనల్ పార్క్ రేంజ్ ఆఫీసర్ బి లక్ష్మణ్ పిలుపునిచ్చారు. బుధవారం మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని చిల్కూర్ రెవెన్యూలో గల మృగవాని నేషనల్ పార్క్ లో ప్రపంచ వన్యప్రాణి దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అజీజ్ నగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పార్కును సందర్శించి అక్కడున్న నెమళ్లు, దుప్పి జింక, లేడి లాంటి వనప్రాణులను తిలకించారు. ఈ సందర్భంగా రేంజ్ ఆఫీసర్ లక్ష్మణ్ మాట్లాడుతూ వన్యప్రాణుల గురించి, వాటితో మానవాళికి ఉన్న అనుబంధాన్ని, వృక్ష సంరక్షణ ఆవశ్యకత తదితర అంశాలపై విద్యార్థులకు వివరించారు. ప్రకృతిలో మానవాళికి కావాల్సిన అనేకమైన ఔషధాలు సుగంధ ద్రవ్యాలు ఎన్నో దాగి ఉన్నాయని తెలిపారు. ప్రకృతిని మనము రక్షించినప్పుడే వాటి ప్రయోజనాలను పొంద గలుగుతామన్నారు. చెట్ల సంరక్షణ విషయంలో బాధ్యతగా ఉండి ప్రతి ఒక్కరు ఒక చెట్టును నాటాలని విద్యార్థులకు సూచించారు.



అంగన్‌వాడీ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ దీపక్ తివారి

## అంగన్వాడీ కేంద్రాల తనిఖీ

**వికారాబాద్, ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలోని ఎన్నపల్లి 1,2 అంగన్వాడీ కేంద్రాల ను బుధవారం జిల్లా కలెక్టరన ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రాలలో పిల్లలకు అందిస్తున్న పోషకాహారం, ప్రీ-స్కూల్ విద్యా కార్యక్రమాలు, హాజరు నమోదు పుస్తకాలు, భద్రతా ప్రమాణాలు తదితర అంశాల ు పరిశీలించారు. కలెక్టర్ పిల్లలతో ముచ్చటించి వారికి అందిస్తున్న ఆహారం నాణ్యతపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. గర్భిణీ స్త్రీలు, బాలింతలకు అందిస్తున్న సప్లిమెంటరీ పోషకాహారంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ సిబ్బందికి పలు సూచనలు చేస్తూ, పిల్లల ఆరోగ్యం, శుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. మిషన్ బగిరథ పైప్ లైన్‌ను పరిశీలించారు. ప్రీ-స్కూల్ విద్యా కార్యక్రమాల ు మరింత మెరుగుపరచాలని సూచించారు. జిల్లాలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలు సమర్థవంతంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అదే గ్రౌండ్‌లో ఉన్న ప్రాథమిక పాఠశాల ను పరిశీలించి విద్యార్థులతో ఇంగ్లీష్ పాఠ్యాంశాలను చదివించారు. ఈ కార్యక్రమంలో శిశు సంక్షేమ అధికారిణి కృష్ణ వేణి తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక తోడేళ్లు

(మొదటి పేజీ తరువాయి)

నదిలో తవ్వకాలు చేస్తూ అప్పటి కప్పుడే ట్రాక్టర్లతో తరలించేస్తున్నారు. ఈ విధంగా రోజుకు తరలిస్తున్న విలువ దాదాపు మూడు లక్షల రూపాయలు వరకూ ఉంటుందని అంచనా. ఇప్పటికే నెల రోజులుగా తరలిపోయిన ఇసుక విలువ రూ.90 లక్షల వరకూ ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. ఇష్టానుసారంగా వాగుల నుంచి ఇసుక తోడేయడంతో భూగర్భజలాలు అడుగంటే ప్రమాదం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇసుక రవాణాకు మంబాపూర్ అడ్డాగా మారడంతో ఇసుకాసురుల వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. గతంలో మంబాపూర్‌లో చౌరాస్తాలో పోలీసు చెక్‌పోస్టు ఏర్పాటు చేయడంతో ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయగలిగారు. ప్రస్తుతం చెక్‌పోస్టు ఎత్తి వేయడంతో ఇసుక మాఫియాకు అడ్డు అదుపు లేకుండా పోయింది. ఇసుక రవాణ కోసం ప్రభుత్వ అనుమతులు తీసుకోవాలన్న నిబంధనలు ఉన్న వాటిని ఖాతరు చేయడంలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఫలితంగా ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతోంది. ప్రస్తుతం ఆయా గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం జరుగుతుండటంతో ఇదే అదనుగా భావించిన ఇసుకాసురులు ఒక్కో ట్రాక్టర్‌కు రూ. 6 వేల నుంచి 7 వేల వరకు వసూలు చేస్తున్నారు. గతంలో జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేసి కేసులు నమోదు చేశారు. అయితే అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవని స్థానిక అధికారులు పదే పదే హెచ్చరిస్తుండటం మినహా.. అక్రమ ఇసుక రవాణకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

## రైతులు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి

**షాబాద్, మార్చి 4, ప్రభాతవార్త:** రైతులు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి దండెం విజయచంద్ర అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ... తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ యాంత్రికరణ పథకంలో భాగంగా 202526 జిల్లాకి 10 వ్యవసాయ డ్రోన్లు 40 శాతం సబ్సిడీపై మంజూరు చేశారన్నారు. ఇందులో భాగంగా ఈ డ్రోన్లను ఫార్మర్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్, పీఏసీఎస్, మహిళా సంఘాలకు అగ్రి డ్రోన్లు 40 శాతం సబ్సిడీపై తీసుకువచ్చారని అన్నారు. ఈ నెల 15వ తేది వరకు షాబాద్ వ్యవసాయ శాఖ కార్యాలయంలో అప్లికేషన్ ధరఖాస్తు చేసుకోవాలన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

**షాబాద్, మార్చి 4, ప్రభాతవార్త:** షాబాద్ మండల పరిధిలోని



లక్ష్మారావుగూడ గ్రామంలో విషాదం నెలకొంది. గ్రామానికి జోగు పెద్ద వెంకటయ్య అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయాన్ని తెలుసుకున్న బంధువులు, స్నేహితులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో ఆయన నివాసానికి చేరుకుని నివాళులు అర్పించారు. మరణానంతరం కుటుంబానికి తక్షణ సహాయంగా గ్రామ సర్పంచ్ శ్రీరంగాపురం కుమార్, ఉప సర్పంచ్ బొబ్బిలి చెన్నారెడ్డి కలిసి రూ.15,000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామంలో ఉన్న నిరుపేద కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని, అత్యవసర పరిస్థితుల్లో అంత్యక్రియల ఖర్చులకు సహాయం అందజేస్తామని తెలిపారు. అంత్యక్రియల నిర్వహణలో సహకరించిన గ్రామ పెద్దలు, యువకులు, మహిళా సంఘ సభ్యులకు కుటుంబ సభ్యులు ప్రత్యేకంగా అభివందనాలు తెలిపారు. గ్రామస్తుల ఐక్యతకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ పెద్దలు మాట్లాడుతూ, జోగు పెద్ద వెంకటయ్య సాదాసీదా జీవితం గడిపిన వ్యక్తి అని, గ్రామ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేవారని గుర్తుచేసుకున్నారు. ఆయన మృతి గ్రామానికి తీరని లోటని పేర్కొన్నారు.

## కార్మికుల భద్రతే మా లక్ష్యం...

**ఎంఎస్ఎన్ కంపెనీలో జాతీయ భద్రత వారోత్సవాలు**

**నందిగామ ,మార్చి 4, ప్రభాతవార్త:** నందిగామ మండల కేంద్రంలో ఉన్న ఎంఎస్ఎన్ పరిశ్రమలో బుధవారం జాతీయ భద్రత వారోత్సవాల్లో భాగంగా ఆ పరిశ్రమ ప్రతినిధుల బృందం,



ఎంఎస్ఎన్ పరిశ్రమలో ప్రతిజ్ఞ చేసిన కార్మికులు

పరిశ్రమల పరిశీలన అధికారులు పర్యవేక్షి ంచారు. పరిశ్రమ భద్రత వారోత్సవాల్లో భాగంగా పరిశ్రమలో పనిచేసే కార్మికులను చైతన్యపరిచారు. పరిశ్రమతో పాటు పరిసరాల అభివృద్ధి, సమాజ వికాసం, మానవాళి మనుగడ కోసం తీసుకోవాల్సిన చర్యల పై విస్తృత చర్చలు జరిపారు. పనిచేసే కార్మికుల ప్రావిణ్యతను, వారి సంరక్షణ పరిరక్షణ విషయమై చర్చలు జరిపారు. ఈ వారోత్సవాల్లో పరిశ్రమ యజమానులు, నల్లగొండ ,మహబూబ్నగర్, రంగారెడ్డి జిల్లాల పరిశ్రమల ఇన్స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి పథకం సీట్ల పెంపు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మార్చి 4, ప్రభాతవార్త**

తెలంగాణ ప్రభుత్వం అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి పథకానికి సంబంధించిన సీట్లను 210నుంచి 500వరకు (ప్రతి సంవత్సరం) పెంచటం జరిగిందని జిల్లాకు చెందిన ఎస్సీ కులాలకు చెందిన విద్యార్థులు టిజిఇపాస్ వెబ్‌సైట్‌లో ధరఖాస్తులు చేసుకోవాలని మేడ్చల్ జిల్లా షెడ్యూల్డ్‌కులాల అభివృద్ధి అధికారి జి.వినోద్‌కుమార్ తెలిపారు. ఎస్సీ కులాలకు చెందిన అర్హులైన విద్యార్థులు అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి పథకం కోసం ఈ నెల 31వ తేదీ వరకు టిజిఇపాస్ వెబ్‌సైట్‌లో ధరఖాస్తులు చేసుకోవాలని ఆయన సూచించారు.

# దోమల నిర్మూలన కోసం యాంటీలార్వా ఆపరేషన్

**మున్సిపల్ కమిషనర్ సుదర్శన్**

**ఇబ్రహీంపట్నం, మార్చి 4, ప్రభాతవార్త:** ఎండాకాలంలో పొంచి ఉన్న దోమల ముప్పు, తాగు నీటి ఎద్దడి వంటి సవాళ్లను అధిగమిస్తూ, ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించడమే లక్ష ్యంగా ముందుకుసాగుతున్నామని మున్సిపల్ కమిషనర్ సుదర్శన్ తెలిపారు. ఆయన బుధవారం 'వార్త'తో మాట్లాడుతూ.. తమ మొదటి ప్రాధాన్యత 100శాతం ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణ అన్నారు. అయితే, ప్రజలకు తడి, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వడంపై ఇంకా పూర్తిస్థాయిలో అవగాహన రావాలన్నారు. దోమల నిరోధానికి వారానికి రెండుసార్లు ఫాగింగ్ షెడ్యూల్‌ను సిద్ధం చేస్తున్నామని చెప్పారు. డ్రైనేజీల్లో



డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న కమిషనర్

లార్వా నిర్మూలన కోసం యాంటీలార్వా ఆపరేషన్లు నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు.. నిర్మాణంలో ఉన్న భవన యజమానులకు కూడా నీరు నిల్వ ఉండకుండా నోటీసులు జారీ ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు. ఎక్కడైనా పైపులైన్ లీకేజీలు ఉంటే వెంటనే రిపేర్ చేసేందుకు ప్రత్యేక టీమ్స్ ఏర్పాటు చేశామని, లోతట్టు ప్రాంతాల్లో నీటి ఎద్దడి రాకుండా ట్యాంకర్లను సిద్ధం చేశామని వివరించారు. ముఖ్యంగా ప్రతి ఆదివారం 'డ్రై' డేగా పాటించి ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ప్రజల భాగస్వామ్యం లేనిదే ఏ మార్పు సంపూర్ణం కాదని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై నిబంధనలు ఉల్లంఘించే జరిమానాలు విధిస్తున్నామని చెప్పారు.

# కార్మికుల సమస్యలను పరిష్కరించాలని వినతి

**ఘట్‌కేసర్, మార్చి 4, ప్రభాతవార్త:** మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సిఐటియు నాయకులు డిసిని కోరారు. ఎంఎంసి ఘట్‌కేసర్ సర్కిల్ కార్యాలయంలో బుధవారం డిప్యూటి కమిషనర్ అల్లూరి వాణిరెడ్డిని కలిసిన సిఐటియు నాయకులు చింతల యాదయ్య, నార్కట్‌పల్లి సబితలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఘట్‌కేసర్, పోచారం, నాగారం మున్సిపాలిటీల్లో పనిచేసిన కార్మికులు జిహెచ్ఎంసిలో వీలీనం కావడంతో విధి నిర్వహణలో పలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ముందునుంచి ఒక చోట పనిచేస్తున్న కార్మికులను ఒక కాలనీ నుంచి మరో ప్రాంతానికి తరచుగా బదిలి చేయడం నిలిపివేయాలని, గ్రామపంచాయతీల్లో పెండింగ్‌లో ఉన్న 8 నెలల ఏరియర్స్‌ను వెంటనే చెల్లించాలని కోరారు. పోచారం మున్సిపాలిటీలో అమలు కాని ఈఎస్ఐ, పిఎఫ్ సదుపాయాలన్ని అమలు చేయాలని, జిహెచ్ఎంసి రూ.26 వేల వేతనాలను చెల్లించాలని, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, 58 సంవత్సరాలు నిండిన కార్మికులకు వారసత్వ ఉద్యోగం ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే పక్షల రోజుల తర్వాత దీర్ఘకాలి దీక్షలో కూర్చోవడం జరుగుతుందని వారు తెలిపగా తన స్థాయిలో పరిష్కారం అయ్యే అంశాలను పరిశీలిస్తామని డిసి వాణి వారికి హామీ ఇచ్చారు.



ఘట్‌కేసర్ సర్కిల్ డిసి వాణిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు యాదయ్య, సబిత

## సురంగల్‌లో ఇవి ఆర్టీసీబస్ సర్వీస్

**సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేను కోరిన 14వ వార్డ్ కౌన్సిలర్ కర్రోల్ల శ్రీధర్**

**ఎమ్మెల్యే ఫోన్‌తో సానుకూలంగా స్పందించిన ఆర్టీసీ విద్యుత్ అధికారులు...**

**మొయినాబాద్, మార్చి 4, ప్రభాతవార్త :** సురంగల్ గ్రామానికి కరోనా కంటే ముందు గతంలో ఉన్నట్లు ఆర్టీసీ బస్ సర్వీసులు పునరుద్ధరించేలా చూడాలని సురంగల్ క్వాటర్స్‌లో విద్యుత్ సమస్య తీర్చేందుకు ఒక ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేయాలని , సురంగల్ మొయినాబాద్ మున్సి పాలిటీ 14 అవార్డు కౌన్సిలర్ శ్రీధర్ చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య కోరారు .అందుకు స్పందించిన చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య సంబంధిత అధికారులకు ఫోన్ చేసి సమస్యను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ గ్రామంలో ఏ సమస్యలు ఉన్నా తప్పకుండా తీరుస్తానని మున్సిపల్‌కు కావలసిన నిధులను కూడా మంచి రోజులు చేయడం జరిగిందన్నారు. 26 వార్డులలో ఏ సమస్య ఉన్న విడుదలవారీగా తప్పకుండా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు కర్రోల శ్రీధర్ మాట్లాడుతూ నూతనంగా14వ వార్డు కౌన్సిలర్ గా ఎన్నికై మొట్టమొదటిసారి స్థానిక ఎమ్మెల్యే యాదయ్యను కలవడంతో గ్రామానికి ఆర్టీసీ బస్ గ్రామంలోని క్వాటర్స్ దగ్గర విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ఇచ్చేందుకు సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులను ఆదేశించినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు అనంతరం మెహిదీపట్నం డిపో మేనేజర్ మూర్తిని కలిసి వినతి పత్రం అందజేశారు డిపో మేనేజర్ బిబికె మూర్తి మాట్లాడుతూ ఇంటర్మీడియట్ విద్యార్థుల పరీక్షలు ఎస్ఎస్సి పరీక్షలకు ప్రత్యేక బస్సులు కేటాయించడం జరిగిందని ఈ పరీక్షలు అయిపోయిన వెంటనే నూతన బస్సు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు బిఆర్ఎస్ నాయకుడు గడ్డం అంజిరెడ్డి , మాజీ వార్డ్ మెంబర్లు కర్రల భాస్కర్, ఎలుగని అశోక్ గౌడ్, మేకల శివ, ఎలుగని ఓం ప్రకాష్ గౌడ్, ఎల్గని చిరంజీవి కలిసిన వారిలో ఉన్నారు

## అనూష మృతిపై విచారణ జరపాలి

**ప్రజా సంఘాల డిమాండ్**

**మోమిన్‌పేట్, మార్చి 4, ప్రభాతవార్త:** గిరిజన బాలిక అనూష మృతిపై విచారణ జరపాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం వారు ప్రభాతవార్తతో మాట్లాడుతూ వికారాబాద్ జిల్లా బాలల సంక్షేమ సమితి, జిల్లా బాలల పరిరక్షణ అధికారికి వినతి పత్రాలు సమర్పించినట్టు తెలిపారు. అదేవిధంగా పలు ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ భూ యజమాని అంతమొల్ల దయాకర్ రెడ్డి బలవంతంగా 14 సంవత్సరాలు కూడా నిండని అనూషతో పని చేయించుకోవడం వల్లే చిన్నారి మృతి చెందిందన్నారు. స్వయానా రాజకీయ నాయకుడైన ఆయన బాధితుల ఆర్థిక, సామాజిక



వినతి పత్రం సమర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు.

పరిస్థితులను ఆసరగా చేసుకొని వారికి అతి తక్కువ వేతనం చెల్లిస్తూ పని చేయించుకున్నారని అన్నారు. పనికి వెళ్తున్న క్రమంలో ట్రాక్టర్ బోల్తా పడి గిరిజన బాలిక అనూష మృతి చెందడానికి దయాకర్ రెడ్డి పూర్తి బాధ్యుడని పేర్కొన్నారు. పోలీసులు మాత్రం దీనిని సాధారణ ప్రమాదంగా కేసు నమోదు చేసి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. అనూషను బాల కార్మికురాలిగా నిర్ధారించడంలో పోలీసులు నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తున్నారని విమర్శించారు. రాజకీయ అండ దండలు ఉండడంతోనే దయాకర్ రెడ్డిపై బాలల హక్కుల చట్టం ప్రకారం కేసు నమోదు చేయడానికి పోలీసులు వెనకాడుతున్నారని అన్నారు. అధికారులు ఈ విషయంపై సమగ్ర విచారణ చేపట్టి అనూషను బాల కార్మికురాలిగా గుర్తిస్తూ బాధ్యుడైన దయాకర్ రెడ్డి పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై త్వరలోనే నవాబ్‌పేట్ మండల కేంద్రంలో దళిత, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి పోరాటానికి కార్యాచరణ సిద్ధంచేయనున్నట్లు సంఘం నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ ప్రజా సంఘం రాష్ట్ర అధ్యక్షులు కట్టెల మల్లేశం, ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి వై.గీతమహేందర్, బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా కన్వీనర్ వి.శివరాజ్, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు గుట్టకింది రవికుమార్, విహెచ్పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్, పిడిఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షులు బి.శ్రీకాంత్, వివిధ ప్రజా సంఘాల నాయకులు ఉమ, జామ దశరథ్, శ్రీనివాస్, బి.నరేందర్, ఎ,మల్లేష్, పి.రమేష్ పాల్గొన్నారు.



ఘటన స్థలంలో రోదిస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

## మృతుడి కుటుంబానికి రూ.7.5లక్షలు ఎక్స్ గ్రేషియా

**కుటుంబంలో ఒకరికి ఔట్ సోర్సింగ్ ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు**

**విచారణ నిమిత్తం సిబ్బందిపై చర్యలు..!**

**షాద్‌నగర్ టౌన్, మార్చి 4, ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా ఫరూక్ నగర్ మండల శివారులోని మహాత్మ జ్యోతిరావు పూలే సంక్షేమ బీసీ వెల్ఫేర్ వసతి గృహంలో చదువుకుంటున్న రాజు అనే విద్యార్థి వసతి గృహ శివారులో ఉన్న చెరువులో పడి మృతి చెందాడు తీవ్రంగా గాలించిన ఎన్డిఆర్ఎఫ్ బృందాలు బుధవారం నాడు రాజు మృతదేహాన్ని వెలికి తీశారు. వసతి గృహ సిబ్బంది నిరక్ష ్యం వల్లనే తమ కుమారుడి ప్రాణం పోయిందని రాజు తల్లిదండ్రులు స్థానిక విద్యార్థి సంఘాల నేతలు ఆందోళన చేపట్టడంతో ఘటన



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న పాలమూరు జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

స్థలానికి చేరుకున్న ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా అడిషనల్ కలెక్టర్ మధుసూదన్ నాయక్ వివరాలు తెలుసుకొని కుటుంబానికి 7 లక్షలయాభై వేల రూపాయలు ఎగ్జిగ్రేషియో చెల్లిస్తున్నట్లు కుటుంబంలో ఒకరికి ఔట్ సోర్సింగ్ ఉద్యోగం ఇందిరమ్మ ఇల్లు కలిపిస్తున్నట్టు తెలిపారు. అదే విధంగా వసతి గృహ సిబ్బంది నిరక్ష ్యంపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు ఘటన స్థలంలో షాద్ నగర్ ఆర్డీఓ ఆర్ఎన్. సరిత తో పాటు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా షాద్ నగర్ ఏసీపీ లక్షీ ్మనారాయణ పట్టణ సిఐ విజయ్ కుమార్ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జయప్రదం చేయండి

**-సిఐటియూ,వ్యవసాయ కార్మిక సంఘం,ఎస్ఎఫ్ఐ నాయకులు**

**కొడంగల్, మార్చి4, ప్రభాతవార్త:**

ఈనెల 7న కొడంగల్ మండల కేంద్రంలో నిర్వమించే అంతర్జాతీయ మహిళా



మాట్లాడుతున్న ఆయా సంఘాల జిల్లా నాయకులు

దినోత్సవాన్ని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రదాన కార్యదర్శి ఎం.వెంకటయ్య, సీఐటీయూ జిల్లా కోషాధికారి బుస్స చంద్రయ్య, ఎస్ఎఫ్ఐ జిల్లా సహయ కార్యదర్శి అనిల్, హస్టల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అద్యక్షులు జి.రాములు పిలుపునిచ్చారు. బుధవారం కొడంగల్లఓ సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, ఎస్ఎఫ్ఐ మహిళా సంఘం, డివైఎఫ్ఐ, రైతుసంఘం అద్వర్యంలో జిల్లా సదస్సును నిర్వహించారు. వారుమాట్లాడుతూ కొడంగల్ నియోజకవర్గంలో ఉన్న మహిళలు పెద్ద సంఖ్యలో హజరై జయప్రదం చేయాలని కోరారు. అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవం వేడుక కాదు. అది సుధీర్ఘ పోరాటాల ఫలితమన్నారు. అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాటం స్పూర్తితో మార్చి 1 నుండి 7 వరకు విస్తృతంగా కేంద్ర ప్రభుత్వ కార్పోరేట్ మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా ప్రచారం నిర్వహించాలని 2026 మార్చి 8న అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవాన్ని దేశవ్యాప్తంగా ఐక్యంగా జరపాలని ఐద్వా, సీఐ టీయూ. రైతు, వ్యవసాయ కార్మిక సంఘం, యువజన, విద్యార్ధి సంఘాల అఖిలభారత కమిటీలు నిర్ణయించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో తెలంగాణా రాష్ట్రంలో 2026 మార్చి 7న కొడంగల్ నియోజకవర్గ కేంద్రంలో జరిగే భారీ ప్రదర్శన, సభను జయప్రదం చేయాలని కోరారు.



విద్యార్థులకు ప్యాడ్లను అందజేస్తున్న శివశక్తి యూత్ సభ్యులు

## ఆత్మవిశ్వాసమే విజయానికి తొలిమెట్టు

**ఆమనగల్లు, మార్చి 4, ప్రభాతవార్త:** అనుకున్న ఆశయాలను చేరుకోవాలంటే విద్యార్థులు ఆత్మవిశ్వాసం కలిగి ఉండాలని శివశక్తి యూత్ సభ్యులు అన్నారు. క్రమశిక్షణ, అంకితభావం అందుకు దోహదపడుతాయని వివరించారు. ఆమనగల్లు మున్సిపాలిటి 15వార్డు పరిధిలోని శివాలయంకాలనీకి చెందిన శివశక్తియూత్ సభ్యులు పదవతరగతి వార్షిక పరీక్షలు పురస్క రించుకుని స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన టెన్తు విద్యార్థులకు ఉచితంగా ఎగ్జామ్ ప్యాడ్లను పంపిణి చేశారు. బుధవారం పాఠశాల ఆవరణలో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి ప్యాడ్లను అందజేశారు. ఈసంధర్భంగా సభ్యులు మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి తనపై నమ్మకం ఏర్పరుచుకుంటేనే విజయం సాధించగలరన్నారు. పోటీ పరీక్షలలో మనోధైర్యంతోనే పోటీ పరీక్షలలో రాణించ వచ్చని సూచించారు. పరీక్షల నేపథ్యంలో రోజువారి టైంటే బుల్ తయారు చేసుకుని అభ్యసిస్తే మరింతగా రాణించే అవకాశాలు ఉంటాయని సూచించారు. కార్యక్రమంలో ఎంగలి శ్రీధర్, జెజ్జాయిల నవీన్‌కుమార్, జటావత్ తరుణ్‌నాయక్, తాళ్ళ సందర్స్‌గౌడ్, గుండ్రాతి కుమార్‌గౌడ్, జటావత్ అరుణ్ నాయక్, గుద్దేటి శివ, సూర్యప్రకాష్, గజ్జె కార్తీక్‌గౌడ్, మణికం రగౌడ్ తదితరులు ఉన్నారు.

## పాంబండ రామలింగేశ్వర బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించాలి

**ఎమ్మెల్యే చేతుల మీదుగా వాల్‌పోస్టర్ విడుదల**

**కుల్కచర్ల, మార్చి 4 ప్రభాతవార్త :** శ్రీ పాంబండ రామ లింగేశ్వర బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించాలని ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి అన్నారు. బుధవారం ఆలయ సిఈఓ బాలనర్సయ్య, సర్పంచ్ మదుగు శ్రీనివాస్, అలయ చైర్మన్ కోట్ల మహిపాల్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే చేతుల మీదుగా వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా



పాంబండ రామలింగేశ్వర స్వామి వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ..ఎంతో ప్రాముఖత కలిగిన స్వామివారి బ్రహ్మోత్సవాలకు వేలదిగా తరలివచ్చే భక్తులకు.. ఇబ్బందులు లేకుండా చూడాలని ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ఆలయ కమిటికి సూచించారు. ముఖ్యంగా పారిశుద్యం, నీటి వసతి కల్పించాలన్నారు. కళ్యాణం, అగ్నిగుండాల రోజుల్లో అధిక సంఖ్యలో వచ్చే భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో దేవాలయానికి అధిక నిధులు కేటాయించి మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అచర్యకులు పాండుశర్మ, గ్రామ ఉప సర్పంచ్ గోవర్ధన్ రెడ్డి, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మిత్రునికి ఆర్థిక సాయం అందజేస్తున్న తోటి మిత్రుడు

## తోటి మిత్రునికి ఆర్థిక సాయం

**కుల్కచర్ల, మార్చి 4 ప్రభాతవార్త:** తమతో కలిసి పదవ తరగతి చదువుకొని అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తోటి మిత్రుడికి ఆర్థిక సాయం చేసి అండగానిలిచారు. మండల కేంద్రానికి చెందిన శివని బాబుఆనారోగ్య కారణంగా గత కొన్ని రోజులుగా హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నాడు .బుధవారం తోటి మిత్రుడు ఆర్థికంగా ఇబ్బందులో ఉన్న విషయం తెలుసుకుని అయన కుటుంబానికి మనోధైర్యంని కల్పించి బాబు త్వరగా కోలుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజు, మాలే కృష్ణయ్య, గోపాల్ రెడ్డి, అనంద్, శామ్ తదితరులు పాల్గొన్నారు.



సిసి రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న సర్పంచ్ వెంకటయ్య

## సిసి రోడ్డు నిర్మాణానికి సర్పంచ్ భూమిపూజ

**కొడంగల్, మార్చి4, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని అప్పాయిపల్లి గ్రామంలోని అంజనేయ స్వామి ఆలయం చుట్టూ సిసి రోడ్డు నిర్మాణానికి గ్రామ సర్పంచ్ బోడ్రాయి వెంకటయ్య భూమిపూజ చేశారు. బుధవారం వార్డు సభ్యులు శ్యామగోకుల్‌సింగ్, బందయ్య గౌడ్‌లతో కలిసి ఆలయం చుట్టూ సిసి రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి కృషి చేయడం జురుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు మోతిసింగ్, సంగప్ప, కాశయ్యగౌడ్, దత్తుసింగ్, కిషన్‌సింగ్, కిష్టప్ప, వెంకటయ్య పాల్గొన్నారు.

## 99 రోజులు స్పెషల్ డ్రైవ్

(మొదటి పేజీ తరువాయి)

మున్సిపాలిటీలలో 100 శాతం ప న్ను వసూళ్ల లక్ష్య సాధనకు చర్యలు తీసుకోవాలని అన్నారు .

మహిళా సంఘాల రుణాల పంపిణీ లక్ష్యాల ు పూర్తిగా సాధించాలని, తక్కువ వసూళ్లు ఉన్న మండలాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ల స్థాపన, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు, శ్రీనిధి రుణాల 100 శాతం వసూళ్లపై కార్యాచరణ రూపొందించాలని తెలిపారు.

మండల స్థాయి అధికారులు తమ పరిధిలోని పాఠశాలల ు నిరంతర పర్యవేక్షణలో ఉంచి వసతి గృహాల్లో భోజన నాణ్యత, పారిశుద్ధ్య పరిస్థితుల ు ప్రతిరోజూ తనిఖీ చేయాలని ఆదేశించారు. పాఠశాలల పర్యవేక్షణ పూర్తి బాధ్యత సంబంధిత అధికారులపైనే ఉంటుందని స్పష్టం చేశారు.

ఇందిరమ్మ ఇళ్ల మంజూరు స్థితి, గ్రౌండ్ లెవెల్ పురోగతి, పెండింగ్ కారణాలు, పారిశుద్ధ్య కార్యక్రమాలు, చెత్త వాహనాలు, డ్రైనేజీ విస్తరణ వివరాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఆదేశించారు. పారిశుద్ధ్యం అత్యంత ముఖ్యమైన అంశమని, అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

ఈ 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రతిరోజు నిర్వహించిన కార్యక్రమాల పూర్తి వివరాల ు రోజువారీ ప్రగతి నివేదికల రూపంలో సమర్పించాలని అధికారుల ు ఆదేశించారు. శాఖల వారీగా పురోగతి, సమస్యలు, తీసుకున్న చర్యలు తదితర వివరాలు సమగ్రంగా నివేదికలో పొందుపరచాలని సూచించారు. కార్యక్రమం అమలుపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు.

ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఆదనపు కలెక్టర్ సుదీర్, రెవె న్యు అదనపు కలెక్టర్ రాజేశ్వరి, ట్రైని కలెక్టర్ హర్ష్ చౌదరి, డి ఆర్ఓ మంగిలాల్, ఆర్‌డిఓ వాసుచంద్ర, డీఆర్‌డీఏ శ్రీనివాస్. డీఏఓ రాజారత్నం తదితరులు పాల్గొన్నారు.

# మోకిలతాండ గ్రామ సర్పంచ్‌గా వర్త్య శాంతమ్మ రీజాయినింగ్

**బాధ్యతలు అప్పగించాలంటూ అధికారులకు కోర్టు ఉత్తర్వులు**

**బూటకపు ఆరోపణలతో సస్పెండ్ చేయించారు : శాంతమ్మ**

**శంకర్‌పల్లి, మార్చి 4, ప్రభాతవార్త:** ఆరోపణలతో అభివృద్ధిని ఎవరు అడ్డుకోలేదని మరోసారి రుజువైందంటూ మోకిలా తాండ గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఓటమిని జీర్ణించుకోలేని కొంతమంది చేసిన పనులకు తెలంగాణ హైకోర్టు మొట్టికాయలు వేసింది. తిరిగి వర్త్య శాంతమ్మను పదవిలో కొనసాగాలని కోర్టు జిల్లా కలెక్టర్కు ఉత్తర్వులు జారీ చేసింది. నిజ నిజాలు ప్రజలు గ్రహిస్తూనే ఉంటారని, బెదిరింపులు అసత్య ఆరోపణలతో ఏం చేయలేరని గ్రామస్తులు అన్నారు. రంగారెడ్డి జిల్లా శంకరపల్లి మండలం మోకిల తండా గ్రామపంచాయతీ సర్పంచ్‌గా వర్త్య శాంతమ్మను తిరిగి పదవిలో కొనసాగాలని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో



ప్రభుత్వాస్తులకు నష్టం కలిగించడం, పంచాయతీ స్థలంలో మొక్కలను ధ్వంసం చేయడం వంటి ఆరోపణలతో సస్పెండ్ కాబడిన శాంతమ్మ హైకోర్టును ఆశ్రయించారు. విచారణ అనంతరం హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. కలెక్టర్ ఆదేశాల మేరకు పెండింగ్ విచారణ కొనసాగు తున్నప్పటికీ ఆమెను సర్పంచిగా బాధ్యతలు స్వీకరించాలని వెంటనే ఉపసర్పంచ్ నుంచి శాంతమ్మ సర్పంచ్ బాధ్యతలను తీసుకోవాలని కోర్టు సూచించింది. ఈ మేరకు చర్యలు చేపట్టాలని జిల్లా, మండల, గ్రామ అధికారులకు కోర్టు సూచించింది. ఈ సందర్భంగా శాంతమ్మ మాట్లాడుతూ నిజం ఎప్పటికైనా గెలుస్తుందని ఎల్లప్పుడూ తనను గెలిపించిన ప్రజల కోసం సేవ చేసేందుకు ముంటానన్నారు. గ్రామ ప్రజల తీర్పుతో గెలిచామని, వారి అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతానన్నారు.

## భ్రమరాంబ మల్లికార్జున స్వామి జాతరకు ఆహ్వానం...


శ్రీనివాసరావును జాతరకు ఆహ్వానిస్తున్న కమిటీ సభ్యులు

**కెపిహెచ్‌బి కాలనీ, మార్చి 4, ప్రభాతవార్త**

కూకట్‌పల్లిలోని శ్రీశ్రీశ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయ జాతర సందర్భంగా వేడుకలకు రావాలని ఆలయ కమిటీ వారు బిఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎన్. శ్రీనివాసరావు (తులసి) ని కలిసి ఆహ్వానించారు. ప్రతి సంవత్సరం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఈ వేడుకలకు హాజరై పూజా కార్యక్రమాలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు అంకనపల్లి రాజులు, సంతోష్ యాదవ్, చైతన్య యాదవ్ తదితరులు ఆహ్వాన పత్రిక అందజేసినారు.

## అభివృద్ధి పనులను పర్యవేక్షించిన కొంతం దీపిక


శివాజీ నగర్‌లో రోడ్డు పనులను పర్యవేక్షిస్తున్న మాజీ కార్పోరేటర్ కొంతం దీపిక తదితరులు

**కంటోన్మెంట్, మార్చి 4 ప్రభాతవార్త:**

నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ రోడ్డు పనులను వేగవంతం చేయాలని మోండా డివిజన్ మాజీ కార్పోరేటర్ కొంతం దీపి తెలిపారు. బుధవారం ఆమె మోండా డివిజన్ శివాజీ నగర్‌లో పెరుమాల్ దేవాలయంలో సమీపంలో కొనసాగుతున్న రోడ్డు పనులను పర్యవేక్షించి ఇంజనీర్లకు,కాంట్రాక్టర్లకు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు జితూ, ప్రశాంత్,రఘు, చిన్న వీరయ్య, రాహుల్, సాయి,నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## 12న డప్పు కళాకారులచే ఢిల్లీలో మహాధర్నా

**రిజర్వేషన్‌లు, ఆర్‌బిఐ ప్రదాత అంబేద్కర్ : వివేక్ వెంకటస్వామి**


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర మంత్రి జి.వివేక్ వెంకటస్వామి

**సైఫాబాద్, మార్చి 4 ప్రభాతవార్త:** రాజ్యాంగ నిర్మాత, రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) స్ఫూర్తి ప్రదాత డా.బి.ఆర్. అంబేద్కర్ ఫోటోను కరెన్సీ నోట్లపైన ముద్రించాలని ఈ నెల 12న ఢిల్లీలో దండోరాకి చెందిన వందలాది మంది డప్పు కళాకారులతో 'చలో ఢిల్లీ' పేరిట 'మహా ధర్నా' నిర్వహిస్తున్నామని అంబేద్కర్ ఫోటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు డా.జేరిపోతుల పరుశు రామ్ తెలిపారు. ఈ మహాధర్నాకు సంబంధించిన వాల్‌పోస్టర్ రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి జి.వివేక్ వెంకటస్వామి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్ సాధనకు సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. ఈ అంశాన్ని సిఎం దృష్టికి తీసుకువెళ్ళి అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయిస్తానని మంత్రి చెప్పారు. అణగారిన వర్గాల ప్రజలకు ఓటు హక్కు ద్వారా ప్రజా ప్రతినిధులను ఎన్నుకోవడం జరిగిందని, రిజర్వేషన్‌ల ద్వారా గ్రామపంచాయితీ నుంచి పార్లమెంట్ వరకు ఎన్నుకోబడుతున్నారంటే అంబేద్కర్ రచించిన రాజ్యాంగమే కారణమన్నారు. ఆర్‌బిఐ ఏర్పాటు చేసి, బ్యాంక్‌లను నెలకోల్పడానికి అంబేద్కరే కారణమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు వైరపాక బెంజిమెన్, బాకి రాజశేఖర్, బి.సుప్రదీప్, గ్యార యాకన్న, బొల్లి స్వామి, బి.మధు తదితరులు పాల్గొన్నారు.

### -చార్మినార్‌లో ఇఫ్తార్ విందులో పాల్గొన్న పలువురు ప్రముఖులు


చార్మినార్ నియోజకవర్గం మూసాబౌలిలో జరిగిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న రాష్ట్ర బిసి కమిషన్ ఛైర్మన్ జి.నిరంజన్,మాజీ మంత్రి మహ్మద్ షబ్బీర్ అలీ

**చార్మినార్,మార్చి 4 ప్రభాతవార్త :** రంజాన్ మాసం సందర్భంగా చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి ముజీబుల్లా షరీఫ్ ఆధ్వర్యంలో ముసాబౌలిలో ఇఫ్తార్ విందు జరిగింది.ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్,మాజీ మంత్రి మహ్మద్ షబ్బీర్ అలీ,హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సయ్యద్ ఖాలీద్ సైపుల్లా,కాంగ్రెస్ నాయకులు కె.వెంకటేష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన ఎస్ఐ సస్పెండ్

**సైదాబాద్, మార్చి 4 ప్రభాతవార్త:**

విధి నిర్వాహణలో నిర్లక్ష్యం వహించారన్న ఆరోపణల నేపథ్యంలో ఐఎస్ సదన్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఎస్ఐ వెంకటేష్‌ను సస్పెండ్ చేస్తూ నగర పోలీస్ కమీషనర్ ఆదేశాలు జారీ చేశారు. పోలీసు శాఖ నిబంధనలు, ఉన్నతాధికారుల ఆదేశాలను బేఖాతరు చేయడం, క్రమశిక్షణా రాహిత్యం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని సదరు ఎస్ఐని సస్పెండ్ చేసినట్లు తెలుస్తుంది. కీలకమైన డ్యూటీలు, సమావేశాలకు కూడా రాకపోవడంతో పాటు ఇతర ఆరోపణల నేపథ్యంలో నగర పోలీస్ కమీషనర్ ఎస్ఐ వెంకటేష్‌ను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఎస్ఐ వెంకటేష్‌పై శాఖా పరమైన విచారణకు ఆదేశాలు జారీ చేశారు.

### జూబ్లీహిల్స్‌లో వ్యాయామం చేస్తూ మృతి

**జూబ్లీహిల్స్, మార్చి 6, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ లోని ఒక జిమ్‌లో వ్యాయామం చేస్తుండగా ఒకరు గుండెపోటుతో మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. జూబ్లీహిల్స్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఖమ్మం జిల్లా కుసుమాంచి మండలం జుజ్జులరావుపేట గ్రామానికి చెందిన నాగండ్ల అనిల్ చౌదరి (51) మాధాపూర్ గుట్టల బేగంపేటలోని సాయి సైబర్ గ్రాండ్ అపార్ట్‌మెంట్స్‌లో నివాసం ఉంటున్నారు. ఈ నెల 3న ఉదయం 11:57 గంటల సమయంలో రోడ్ నెం.36లోని ఎస్పో జిమ్‌లో వ్యాయామం పూర్తి చేసుకున్న అనంతరం వాష్‌రూమ్‌కు వెళ్లిన అనిల్ చౌదరి అక్కడ అకస్మాత్తుగా అస్వస్థతకు గురై కుప్పకూలిపోయారు. జిమ్ సిబ్బంది గమనించి వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చి, సీపీఆర్ నిర్వహించారు. ఆయన స్పందించకపోవడంతో వైద్యులు గుండెపోటుతో మరణించినట్లు నిర్ధారించారు. ఈ విషయమై మృతుడి బంధువు నాగండ్ల ఉదయ్ కుమార్ ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతిపై ఎలాంటి అనుమానం లేదని ఫిర్యాదుదారు పేర్కొన్నారు.

# ఘనంగా హోలీ వేడుకలు


బోర్డు మెంబర్ బానుక నర్మధ ఇంట్లో హోలీ సందడి


బోయిన్‌పల్లిలో హోలీ వేడుకల్లో పాల్గొన్న మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి తదితరులు


కుటుంబ సభ్యులతో హోలీ సంబురాలలో పాల్గొన్న వడ్డేపల్లి


పురానాపూల్‌లో హోళీ వేడుకల్లో పాల్గొన్న యువతి,యువకులు


వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పబ్లిక్ గార్డెన్‌లో హోలీ వేడుకల్లో పాల్గొన్న వాకర్స్ ప్రతినిధులు ఎన్.ఆర్.లక్ష్మన్‌రావుగుప్త తదితరులు


కుత్బుల్లాపూర్ పద్మానగర్‌లో భారతీయ జనతాపార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి గిరివర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో హోళీ సంబరాలు


జీహెచ్ఎంసీ కార్మికులతో కలిసి హోళి వేడుకల్లో మాజీ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్.


బీజేపీ నియోజకవర్గ కార్యాలయంలో వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి.


కుమ్మరివాడి శ్రీ కనకదుర్గ దేవాలయం వద్ద రంగులు చల్లుకుంటున్న యువకులు


బండ్లగూడ జాగీర్ డివిజన్‌లో హోళీ సంబరాలు జరుపుకుంటున్న బిజెపి అధ్యక్షులు మహేష్ యాదవ్, నాయకులు మల్లారెడ్డి, నరేష్ యాదవ్, అభినయ్‌గౌడ్ తదితరుల దృశ్యం.

## ప్రజల భద్రతే పోలీసుల ప్రాథమిక విధి : డిసిపి చంద్రమోహన్

**-మాసబ్ ట్యాంక్ హాకీ గ్రౌండ్‌లో గోల్కొండ జోన్ పోలీసుల మొబిలైజేషన్ డ్రిల్**

**మెహిదీపట్నం, మార్చి 04, ప్రభాతవార్త :** ప్రజల భద్రత పోలీసుల ప్రాథమిక విధి అని గోల్కొండ జోన్ డిసిపి జి. చంద్రమోహన్ అన్నారు. క్లిష్ట సమయాల్లో ఏ క్షణం లోనైనా బలగాలు మోహరించడం చాలా కీలకమని తెలిపారు. సిటీ పోలీస్ కమిషనర్ సజ్జనర్ ఆదేశాల మేరకు మంగళవారం రాత్రి మాసబ్ ట్యాంక్ హాకీ గ్రౌండ్ లో గోల్కొండ జోన్ పోలీసుల ఆధ్వర్యంలో మొబిలైజేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గోల్కొండ జోన్ డిసిపి జి.చంద్రమోహన్ హాజరై మాట్లాడారు. ఏదైనా అవాంఛనీయ సంఘటనలు లేదా అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు అది తక్కువ సమయంలో సిబ్బంది అందరూ నిర్ణీత ప్రదేశానికి ఎలా చేరుకోవాలో వివరించడానికి ఇలాంటి ఫుల్ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీసు యంత్రాగం వేగంగా స్పందించే సామర్థ్యాన్ని పెంపొందించేందుకు ఇలాంటి డ్రిల్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. హోంగార్డుల నుండి ఏసీపీల వరకు ప్రతి ఒక్కరు ఉన్నతాధికారుల ఆదేశాలను పాటిస్తూ...తమకు కేటాయించిన బాధ్యతలను జోనల్ కంట్రోల్ రూమ్ సమన్వయం చేసుకుంటూ ఎలా అమలు చేయాలో సూచనలు చేశారు. శాంతి భద్రతల పరిరక్షణకు అలుపెరగని కృషి చేస్తున్న గోల్కొండ జోన్ పోలీసులను ఆయన అభినందించారు. అనంతరం అత్యవసర సమయాల్లో అవసరమయ్యే పబ్లిక్ అడ్రస్ సిస్టం, అల్లర్ల నియంత్రణ, పరికరాలు ఫైర్ బాల్స్ వంటి సామాగ్రి పనితీరును మరియు లభ్యతను తనిఖీ చేశారు. అర్ధరాత్రి సమయంలో మాసబ్ ట్యాంక్ హాకీ గ్రౌండ్ వంటి కీలక ప్రాంతాల్లో భద్రత ఏర్పాట్లను మరియు పోలీసు బలగాల అప్రమత్తతను డిసిపి స్వయంగా పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో గోల్కొండ జోన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల నుండి హోంగార్డు స్థాయి నుండి ఏసీపీ స్థాయి అధికారులతో పాటు 650 మంది సిబ్బంది పాల్గొన్నారు.


మాసబ్ ట్యాంక్ హాకీ గ్రౌండ్ లో జరిగిన మొబిలైజేషన్ డ్రిల్ కార్యక్రమంలో పాల్గొన్న గోల్కొండ జోన్ డిసిపి జి. చంద్రమోహన్.

## సేంద్రియ ఎరువుల వినియోగంపై రైతులకు ప్రత్యేక శిక్షణ

**అత్తాపూర్ మార్చి 4, ప్రభాతవార్త :**

రాజేంద్రనగర్ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో నేల ఆరోగ్య విభాగం, సినారే ఆధ్వర్యంలో నేల పరీక్షలు, స్థానిక వాతావరణ ప్రభావాలు, పంటల వ్యవస్థలు మరియు సేంద్రియ ఎరువుల వినియోగం" పై రైతులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం టిజిసిఓఎస్‌టి వారి సౌజన్యం తో బుదవారం సెంటర్ ఫర్ హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్‌లో ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పిజెటిఎయూ పరిశోధన సంచాలకులు డా. ఎం. బలరాం మాట్లాడుతూ... నేల పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగం చేయడం ద్వారా పంటల దిగుబడి పెరగడంతో పాటు నేల ఆరోగ్యం దీర్ఘకాలికంగా మెరుగుపడుతుందని తెలిపారు. సమతుల్య ఎరువుల వినియోగం, సేంద్రియ ఎరువుల ప్రాముఖ్యత, మరియు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ప్రణాళిక రూపొందించడం ద్వారా సుస్థిర వ్యవసాయాన్ని సాధించవచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ రకమైన శిక్షణ ద్వారా స్వంతంగా లాబరేటరీని ఏర్పాటు చేసుకునే నైపుణ్యం పొందవచ్చని తెలిపారు. తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రాజెక్ట్ ఆఫీసర్ (ఎఫ్ఎసి) మరియు అసిస్టెంట్ మెంబర్ సెక్రటరీ డా. ఎస్. శ్రీనివాస్ మాట్లాడుతూ, రైతులకు శాస్త్రీయ వ్యవసాయ పరిజ్ఞానం చేరేలా ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని చెప్పారు. పరిశోధనా సంస్థలు అభివృద్ధి చేసిన సాంకేతికతలను రైతులకు చేరవేయడం ద్వారా వ్యవసాయ ఉత్పాదకతను పెంచవచ్చని తెలిపారు.డా. ఎం. జగన్ మోహన్ రెడ్డి, డైరెక్టర్, సిహెచ్‌ఆర్‌డీ,పిజెటిఎయూ, ఈ శిక్షణ కార్యక్రమం రైతులకు ఆధునిక వ్యవసాయ సాంకేతికతలను పరిచయం చేయడంలో ముఖ్య పాత్ర పోషిస్తుందని అన్నారు.కార్యక్రమ ప్రారంభంలో డా. ఎ. మాధవి, ప్రిన్సిపల్ సైంటిస్ట్ హెడ్, నేల ఆరోగ్య విభాగం , సినారే సభకు స్వాగతం పలికి, శిక్షణ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యాలను వివరించారు.



ఈ శిక్షణలో నేల నమూనాల సేకరణ, నేల పరీక్ష విధానాలు, నేల పరీక్ష ఫలితాల విశ్లేషణ, వాతావరణ ప్రభావాల అవగాహన, పంటల ప్రణాళిక మరియు సేంద్రియ ఎరువుల వినియోగం వంటి అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో నేల ఆరోగ్య విభాగం ప్రధాన శాస్త్రవేత్తలు డా. శ్రీదేవి, డా. సుకృత కుమార్ , డా. ఎం. శంకర్, డా . రెడ్డి ప్రియ. పాల్గొన్నారు.

## మహిళలు ఆరోగ్యంపై దృష్టిపెట్టాలి : సూర్యోదయ ఫౌండేషన్ డా.సురేఖరెడ్డి

**హైదరాబాద్, మార్చి 3,ప్రభాతవార్త:** మహిళలు ముఖ్యంగా తమ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని, అ ప్పుడే కుటుంబం తర్వాత సమాజం బాగుపడుతుందని సూర్యోదయ ఫౌండేషన్ ఫౌండర్ డాక్టర్ సురేఖ రెడ్డి అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు హోటల్లో ఆర్ టి ఐ హ్యూమన్ రైట్స్ యాక్టివిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా. సురేఖ రెడ్డి మాట్లాడుతూ మహిళలు తమకు ఆసక్తి ఉన్న రంగాల్లో రాణించేందుకు కృషి చేయాలని, అప్పుడే అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటారని తెలిపారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు సాయి ప్రసాద్ రావు మాట్లాడుతూ మహిళలు సాధికారత సాధించినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ మోనిక మాట్లాడుతూ కుటుంబంలో మహిళ చదువు ఆ ఇంటికి వెలుగు అని పేర్కొన్నారు. అనంతరం వివిధ రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మహిళలకు శాలువతో సన్మానించి, మెమోటోలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్ల సమస్యల పరిష్కారానికి 50 మంది సీనియర్ సిటిజన్ల కమిటీకి చైర్మన్ గా జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని అసోసియేషన్ తీర్మానించింది. విదేశాల తరహాలో సీనియర్ సిటిజనులకు సహాయపడే విద్యార్థులకు క్రెడిట్ పాయింట్లు ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సౌత్ ఇండియా చీఫ్ అడ్వైజర్ అజయ్ కుమార్, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఎం పోచయ్య, మహిళా విభాగ ప్రెసిడెంట్ రోజా రాణి, డాక్టర్స్ ప్రెసిడెంట్ శరత్ కుమార్, జనరల్ సెక్రెటరీ వెంకట నరసింహారెడ్డి, కోఆర్డినేటర్ ఏ సాయి వెంకట్రావు, నేషనల్ ప్రెసిడెంట్ కామేష్ గాడి, సౌత్ ఇండియా చైర్మన్ ఆల్ఫా కృష్ణ, సభ్యులు వినోద్ కుమార్, శ్రీనివాస్, ప్రేమ్ కుమార్, శ్రీను, సుబ్బు పాల్గొన్నారు.


వివిధ రంగాల్లో రాణించిన మహిళలను సన్మానిస్తున్న దృశ్యం

## పవన్ కళ్యాణ్ ఆశయాలు, పార్టీ సిద్ధాంతాలు నచ్చడం వల్లే చేరికలు : ముమ్మారెడ్డి ప్రేమ కుమార్

**కెపిహెచ్‌బి కాలనీ, మార్చి 4, ప్రభాతవార్త**

జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలు ఆశయాలు సమాజ సేవ కార్యక్రమాలు నచ్చడం వల్లే పలువురు తమ పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారని సైబరాబాద్ కార్పొరేషన్ కోఆర్డినేటర్ ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ పేర్కొన్నారు. కెపిహెచ్‌బి కాలనీలోని జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన నాయకులు పవన్ నాయుడు ఆధ్వర్యంలో సైబరాబాద్ కార్పొరేషన్ కోఆర్డినేటర్ ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ సమక్షంలో కూకట్‌పల్లి నియోజకవర్గం అల్లాపూర్ గాయత్రి నగర్ డివిజన్ నుండి 31 మంది మహిళలు ఉద్యమి క్రియాశీలక సభ్యత్వంలో నమోదు చేసుకొని జనసేన పార్టీలోకి అధికారికంగా చేరారు. ఈ సందర్భంగా వారికి ప్రేమకుమార్ పార్టీ కండువా కప్పి వారిని సాదరంగా జనసేన పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రేమకుమార్ మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ ఆశయాలు, పార్టీ సిద్ధాంతాలు, సమాజ సేవ పట్ల ఆయనకున్న అంకితభావం అనేక మందిని ఆకర్షిస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ కూకట్‌పల్లి జోన్ కో ఆర్డినేటర్లు మండలి దయాకర్, కొల్లా శంకర్, మండలి అనిల్, అడక్ కమిటీ సభ్యులు అనిత గాలి,వేముల మహేష్, పోలేబోయిన శ్రీనివాస్, రణదీప్, యోగేష్, జాల రవి, తుంగల రా మారావు పాల్గొన్నారు.


మహిళలకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రేమ కుమార్

## మాదిగ జాతిపై ప్రొఫెసర్ కాశీం కుట్రలు చేస్తున్నారు : ఎంఎస్ఎఫ్

**తార్నాక, మార్చి 4 ప్రభాతవార్త :** మాదిగ జాతి ఆత్మగౌరవాన్ని సీఎం రేవంత్ రెడ్డి దగ్గర ప్రొఫెసర్ కాశీం తాకట్టు పెడుతున్నారని ఎంఎస్ఎఫ్ నాయకులు ఆరోపించారు. మాదిగ ఉద్యోగుల పేరు మీద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చేయబోతున్న సన్మాన కార్యక్రమం పద్మశ్రీ మందకృష్ణ మాదిగకి, ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి ఎట్లాంటి సంబంధం లేదని నాయకులు పేర్కొన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెస్ ఎఫ్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ చిప్పలపల్లి సోమశేఖర్ మాదిగ, రాష్ట్ర అధ్యక్షులు సందే కార్తీక్ మాదిగ, రాష్ట్ర అధికార ప్రతినిధి డా.కొమ్ము శేఖర్ మాదిగలు మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఎంతో మంది మాదిగ జాతి బిడ్డలు అనేక త్యాగాలకు వెనకాడకుండా ప్రాణ త్యాగాలు, జైలు జీవితాలు, లాఠీ దెబ్బలు, కుటుంబాలను జీవితాలను పణంగా పెట్టి సుదీర్ఘ పోరాటంతో సాధించుకున్నది ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అన్నారు.ఎ పాలకుని దయ దాక్షిణ్యాలతో ఎస్సీ వర్గీకరణ రాలేదని ఎమ్మార్పీఎస్ పోరాటంతో సాధించుకున్నదన్నారు. వర్గీకరణ చేసిందు అని మాదిగ ఉద్యోగుల పేరుమీద రేవంత్ రెడ్డికి చేయాలనుకుంటున్న సన్మాన కార్యక్రమం ముమ్మాటికి కొంతమంది స్వార్థపూరిత ఆలోచన మాత్రమే అవుతోందన్నారు. ఆ కార్యక్రమానికి మందకృష్ణ మాదిగకి,మాదిగ దండోరా ఉద్యమానికి గాని, మాదిగ ఉద్యోగస్తులకు గాని ఎలాంటి సంబంధం లేన్నారు. ఈ విలేకరుల సమావేశంలో ఎంఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి డాక్టర్ పల్లెర్ల సుధాకర్ మాదిగ, జాతీయ ఉపాధ్యక్షులు తోకల చిరంజీవి మాదిగ, రాష్ట్ర కార్యదర్శి బైరపోగు శివకుమార్ మాదిగ, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు జనపాల మహేష్ మాదిగ, రాష్ట్ర నాయకులు ఎడవెల్లి అజయ్ మాదిగ, ఉస్మానియా యూనివర్సిటీ నాయకులు దావు ఆదిత్య మాదిగ,హరి ప్రసాద్ మాదిగ, నంబి మాదిగ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంఎస్ఎఫ్ నాయకులు

## మతసామరస్యానికి ప్రతీకగా హోలీ పండుగ


హోలీ వేడుకలలో పాల్గొన్న హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ

**ముషీరాబాద్, మార్చి 4, ప్రభాతవార్త:** మతసామరస్యానికి ప్రతీకగా హోళీ పండుగ నిలుస్తుందని హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. బుధవారం హోళీ పండుగ సందర్భంగా ఇందిరాపార్కులో ఇందిరాపార్కు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికులు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులతో కలిసి రంగులు చల్లుకుని, నృత్యాలతో, కోలాటాలతో సందడి చేశారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ, ముఠా గోపాల్ మాట్లాడుతూ హోళీ పండుగ వయసుతో సంబంధం లేకుండా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ సంతోషంగా, ఐకమత్యంతో జరుపుకుంటామని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ ఏ.సుధాకర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి మంద శ్రీనివాస్‌ముదిరాజ్, ఉపాధ్యక్షులు ప్రభాకర్ యాదవ్, తాటి శ్రీనివాస్, తిరుపతిరెడ్డి, సంయుక్త కార్యదర్శులు రమేష్‌గుప్తా, బి.నరేందర్, కోశాధికార గాజుల శంకర్, కార్యనిర్వాహక కార్యదర్శులు మెట్టుసాయిరెడ్డి, బి.చందర్, కోఆర్డినేటర్లు బి.సరోజిని, ఆర్.కే.శ్రీనివాస్ ముదిరాజ్, అశోక్‌చంద్‌జైన్, క్రీడల సెక్రటరీలు డాక్టర్ ఎస్.సోమేష్, ఎన్.లక్ష్మీసామ్రాజ్యం, వాకర్స్ అసోసియషన్ ప్రతినిధులు కిషన్‌గౌడ్, శ్రీరామ్, పందరి రాజు, శేరుపల్లి గణేష్, సంగిశెట్టి శ్రీధర్‌రాజ్, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

### 99 రోజుల యాక్షన్ ప్లాన్‌పై ప్రత్యేక కార్యాచరణ

**చాంద్రాయణగుట్ట, మార్చి 4, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం 99 రోజులు యాక్షన్ ప్లాన్‌తో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ప్రజాపాలన పట్టణ ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జీహెచ్ఎంసి చార్మినార్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్‌రెడ్డి అధికారులకు అదేశించారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈనెల 6వ తేదీ నుండి జూన్ 12 వరకు 99 రోజులపాటు నిర్వహించే ప్రజాపాలన పట్టణ ప్రణాళిక కార్యక్రమంపై నర్కి పుల్‌బాగ్‌లోని జోనల్ కార్యాలయంలో బుధవారం అధికారులతో సమావేశం నిర్వహించారు. జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 99 రోజుల పాటు నిర్వహించనున్న ప్రజాపాలనపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలన్నారు. ఈ సమావేశంలో చార్మినార్,సంతోష్ నగర్, మూసా రం బాగ్ సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్‌లు సరిత, మంగ తయా రు, భాస్కర్ రెడ్డి,పారిశుద్ధ్య విభాగం డీఈలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ నివారణపై అవగాహన




**అత్తాపూర్ మార్చి 4, ప్రభాతవార్త :** క్యాన్సర్ నివారణపై ఫెనమ్ కేర్స్ ద్వారా, బాయి రెడ్డి ఫౌండేషన్‌తో భాగస్వామ్యంగా నగరంలో పలు ప్రాంతాల్లో రద్దీ కూడళ్ల వద్ద క్యాన్సర్ నివారణ అవగాహన డ్రైవ్‌ను విజయవంతంగా నిర్వహించింది. ముందస్తు నిర్ధారణ, క్రమం తప్పని స్క్రీనింగ్, నివారణాత్మక ఆరోగ్య సంరక్షణ ప్రయోజనాల ప్రాముఖ్యతను ఈ కార్యక్రమం ప్రధానంగా ఎత్తిచూపింది.పీక్ అవర్స్‌లో అధిక రద్దీ ఉన్న కూడళ్ల వద్ద ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి, ప్రజల నిత్యజీవితంలోనే కీలక ఆరోగ్య సమాచారాన్ని చేరవేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా ఫెనమ్ ఉద్యోగి వాలంటీర్లు రద్దీ సిగ్నల్ పాయింట్ల వద్ద నిలబడి, క్యాన్సర్ నివారణ ప్రయోజనాలపై ప్రభావవంతమైన సందేశాలతో ప్లకార్డులు ప్రదర్శించారు. అదనంగా, ప్రజలకు క్యాన్సర్ అవ గాహన బ్యాడ్జ్‌లు పంపిణీ చేసి, క్రమం తప్పని స్క్రీనింగ్ మరి యు ఆరోగ్యకర జీవనశైలిపై అవగాహన పెంపొందించేలా ప్రోత్సహించారు.

### కెపిహెచ్‌బిలో స్పా సెంటర్లపై దాడులు...20 మంది అరెస్ట్

**కెపిహెచ్‌బి కాలనీ, మార్చి 4, ప్రభాతవార్త**

కెపిహెచ్‌బి పోలీస్ స్టేషన్ పరిధిలోని స్పా సెంటర్లపై బుధవారం పోలీసులు ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా కార్యకలాపాలు నిర్వహించినందుకు గాను రెండు స్పా సెంటర్లపై రెండు కేసులు నమోదు చేసినట్లు కెపిహెచ్‌బి కాలనీ సీఐ రాజశేఖర్ రెడ్డి వెల్లడించారు. దాడి సందర్భంగా మొత్తం 20 మందిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. నిబంధనలు అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని రాజశేఖర్ రెడ్డి హెచ్చరించారు.

### కెపిహెచ్‌బిలో పేకాట స్థావరంపై దాడి..ఐదుగురి అరెస్ట్

**కెపిహెచ్‌బి కాలనీ, మార్చి 4, ప్రభాతవార్త**

కెపిహెచ్‌బి పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాట నిర్వహిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు బాలానగర్ ఎస్ఓటీ పోలీసులు ఆదిత్యనగర్ అడ్డగుట్టలోని ఒక ప్రైవేట్ లగ్జరీ స్టే ఇన్ గదిపై దాడి చేశారు. దాడి సందర్భంగా గదిలో పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని కెపిహెచ్‌బి పోలీసులకు అప్పగించారు. పోలీసుల దాడిలో కెపిహెచ్‌బి కాలానికి చెందిన దేవలరాజు వెంకట శేష చలం (48), పార్వతనేని వీరభద్రరావు (47), పెద్దినేని పవన్ కుమార్ (36), ఒబిలినేని గణేష్ (36), పార్వతనేని రాంబాబు (45) తదితరులు ఉన్నారు.వారి వద్ద నుంచి రూ.39,010 నగదు, ఐదు మొబైల్ ఫోన్లు, ఆరు సెట్‌ల పేకాట కార్డులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న మొత్తం ఆస్తి విలువ సుమారు రూ.89,010/గా పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

## చోరీ కేసుల్లో నిందితుల అరెస్ట్

**-45 తులాల వెండి, 3.5 గ్రాముల బంగారం సహా పలు వస్తువులు స్వాధీనం**


స్వాదీనం చేసుకున్న ఆభరణాలను చూపిస్తున్న ఏసీపీ జగన్, ఇన్స్‌పెక్టర్లు మహేష్,లెనిన్ బాబు

**తార్నాక, మార్చి 4 ప్రభాతవార్త :**

ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన చోరీ కేసును పోలీసులు ఛేదించారు. ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి సుమారు 45 తులాల వెండి, 3.5 గ్రాముల బంగారం సహా పలు విలువైన వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు బుధవారం ఓ.యూ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను ఓ.యూ ఏసీపీ జగన్ వెల్లడించారు. గత నెల 25న తార్నాకలోని రుహైనా అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న కామిరి కృష్ణ (38) ఫిర్యాదు చేశారు. జనవరి 12న కుటుంబంతో కలిసి సంక్రాంతి పండుగ కోసం స్వగ్రామమైన పెద్దపల్లికి వెళ్లి, జనవరి 25న తిరిగి నగరానికి వచ్చారు. ఫిబ్రవరి 29న సాయంత్రం ఇంటికి చేరుకున్నప్పుడు తలుపుల గడియలు పగులగొట్టి ఇల్లు దోపిడీకి గురైనట్లు గుర్తించారు.ఇంట్లోని వెండి, బంగారు ఆభరణాలు, హెచ్‌పీ ల్యాప్‌టాప్, రియల్‌మీ మొబైల్ ఫోన్, బోట్ స్పీకర్, 10 గడియారాలు, రూ.2,30,000 నగదు దొంగిలించబడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మొత్తం చోరీ జరిగిన ఆస్తి విలువ రూ.5,92,000గా అంచనా వేశారు.ఈ కేసును దర్యాప్తు చేసిన ఓయూ పోలీసులు సీసీటీవీ ఫుటేజీలు, సాంకేతిక ఆధా రాల సహాయంతో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. సుర పురం హర్ష వర్ధన్ (27), డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. అతని స్నేహితుడైన సల్మాన్ ఖాన్ (37) – నిరుద్యోగి. ప్రధాన నిందితుడు హర్ష వర్ధన్‌పై గతంలో కూడా పలు చోరీ కేసులు నమోదయ్యాయి.నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ వెల్లడించారు.

# ఘనంగా హోలీ సంబురాలు



హోలీ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే



చేగుర్లో హోలీ సంబరాలు జరుపుకున్న శేఖర్ తదితరులు.



షాబాద్: హోలీ వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు



వార్డు సభ్యులు,యువకులతో కలిసి హోలిలో పాల్గొన్న సర్పంచ్ సొప్పరి ధనలక్ష్మి రామకృష్ణ

## శంషాబాద్‌లో .. హోలీ వేడుకలలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి

**షాద్‌నగర్ రూరల్, మార్చి 4, ప్రభాతవార్త :** అందరి కుటుంబాల్లో సంతోషాలు నింపాలని కోరుకుంటూ శంషాబాద్ లోని శ్రీసాయి విహార్ కాలనీ వాసులతో కలసి హోలీ సంబురాల్లో పాల్గొన్న షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి తదితరులు.

## హోలీ అందరి జీవితాలను సప్తవర్ణ శోభితం చేయాలి

**నందిగామ, మార్చి 4, ప్రభాతవార్త:** నందిగామ మండలంలోని ఆయా గ్రామాలలో ప్రజలు బుధవారం హోలీ సంబరాలు ఘనంగా జరుపు కున్నారు. నందిగామ మండల కేంద్రానికి చెందిన పాత్రికేయులు సహజ సిద్ధమైన రంగులను చల్లుకొని అందరికీ ఆదర్శప్రాయంగా నిలిచారు. వీరందరిని చూసి నందిగామ సర్పంచ్ కొమ్ము కృష్ణ, ఉప సర్పంచ్ వెంకటేష్ గౌడ్‌లు సైతం హర్షం వ్యక్తం చేయడం గర్వకారణం. సహజ సిద్ధమైన రంగులు చల్లుకొని స్నేహపూరిత వాతావరణంలో పండుగ జరుపుకోవాలని నందిగామ ఇన్స్పెక్టర్ ప్రసాద్ గారితో పాటు, వైద్యాధికారుల ఆదేశాల మేరకు పాత్రికేయ మిత్రులు రసాయనిక రంగులను వాడకుండా, సహజ రంగులను చల్లుకొని ఎంజాయ్ చేశారు. చేగూర్‌లో 7వ వార్డ్ మెంబర్ పబ్బేశేఖర్ ఆధ్వర్యంలో హోలీ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతికి, సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలిచిన హోలీ అందరి జీవితాలను సప్తవర్ణ శోభితం చేయాలని ఆయన భగవంతుని కోరుకున్నారు. హోలీ సందర్భంగ చేగూరు గ్రామ ప్రజలందరికీ హోలీ శుభాకాంక్షలు తెలిపారు.

## వసంతరుతువుకు స్వాగతం పలుకుతూ ..

**షాబాద్, మార్చి 4, ప్రభాతవార్త:** చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక హోలీని బుధవారం షాబాద్ మండలంలో అన్ని గ్రామాలల్లో హోలి సంబురాలు ఘనంగా జరుపుకున్నారు. చిన్నా, పెద్ద తారతమ్యం లేకుండా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. మన జీవితాల్లో సంతోషాన్ని వికసించే వసంతరుతువుకు స్వాగతం పలుకుతూ రంగుల హోలీ అందరికి ఆనందాన్ని పంచాలన్నారు. ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, ప్రజలు హోలి ఉత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

## అంబరాన్నంటిన సంబురాలు

**కేశంపేట, మార్చి 4, ప్రభాతవార్త :** కేశంపేట మండల పరిధిలోని కొనాయపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ చొప్పరి ధనలక్ష్మి ్మ రామకృష్ణ ముదిరాజ్ ఆధ్వర్యంలో హోలీ పండుగ సంబరాలు అంబరాన్నంటాయి . ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ సొప్పరి ధనలక్ష్మి ్మ రామకృష్ణ ముదిరాజ్ హోలీ వేడుకల్లో పాల్గొని గ్రామ ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సర్పంచ్ మాట్లాడుతూ చెడుపై మంచి విజయం సాధించిన రోజు ఈ హోలీ పండుగ అని ఈ హోలీ వేడుకలలో చిన్న పెద్ద తేడా లేకుండా యువకులు, కులమతాలకు అతీతంగా పాల్గొని రంగులు జల్లుకుంటూ ఆనంద ఉత్సవాల మధ్య హోలీని వేడుకలను జరుపుకోవడం ఎంతో వైభవంగా అనిపించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ హనుమంత్ నాయక్ , వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు మరియు యువకులు, తదితరులు పాల్గొన్నారు.

## మోమిన్‌పేట్‌లో బాజా భజంత్రీలతో...

**మోమిన్‌పేట్, మార్చి 4, ప్రభాతవార్త:** మోమిన్‌పేట్ మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలలో చిన్నా, పెద్ద, యువకులు ఆనందోత్సవాల మధ్య హోలీ పండుగను జరుపుకున్నారు. అదేవిధంగా హోలీ పురస్కరించుకొని రోజు చంద్రగ్రహణం కారణంగా కొన్ని గ్రామాల్లో మంగళవారం, మరికొన్ని గ్రామాల్లో బుధవారం జరుపుకున్నారు. యువకులు, చిన్నారులు హోలీ పండుగను పురస్కరించుకొని రంగురంగుల అలంకరణతో ఒకరికొకరు రంగులు వేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మండల పరిధిలోని వెల్చాల్ గ్రామ యువ నాయకుడు మధుసుదన్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ యువకులు బాజా భజంత్రీలతో రంగులు వేసుకుంటూ ఆడుతూ పాడుతూ ప్రశాంత వాతావరణంలో జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మధుసుదన్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా కులమతాలకతీతంగా ఈ హోలీ పండుగ సంబురాలు చిన్నా, పెద్ద, యువకులు కలిసి మెలిసి చేసుకోవడం చాలా సంతోషం అని అన్నారు. హోలీ పండుగ సందర్భంగా తన వంతు సాయంగా యువకులకు విందు, భోజనం ఏర్పాటు చేసి అందరితో కలిసి ఆడుతూ పాడుతూ హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని చిన్నా, పెద్ద, యువకులు కులమతాలకతీతంగా ప్రతి ఒక్కరు పాల్గొన్నారు. అలాగే టేకులపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ బండ విష్ణువర్ధన్ రెడ్డి హోలీ పండుగ సంబురాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని ఆయా యువజన సంఘాలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి తన నివాసం వద్ద బిఆర్‌ఎస్ శ్రేణులతో,ప్రజలతో హోళీ సంబరాల్లో డ్యాన్సలు చేస్తూ డోల్ వాయిస్తూ పాల్గొన్న దృశ్యం



హోళీ సంబురాల్లో పాల్గొన్న యువ నాయకుడు మధుసుదన్ రెడ్డి.

## హోళీ సంబరాల్లో డ్యాన్సలు చేస్తూ పాల్గొన్న మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మార్చి 4, ప్రభాతవార్త**

మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి హోళీ సంబరాల్లో పాల్గొని డ్యాన్సలు చేసి బిఆర్‌ఎస్ శ్రేణులను, అభిమానులను ఉత్సాహ పరిచారు. బుధవారం బోయినిపల్లిలోని ఆయన నివాసంకు చేరుకున్న బిఆర్‌ఎస్ శ్రేణులతో, అభిమానులతో కలిసి హోళీ సంబరాల్లో పాల్గొని అందరిని ఉత్తేజపరిచారు. హోళీ పండుగ సందర్భంగా బోయినిపల్లిలోని ఆయన క్యాంపు కార్యాలయం వద్ద బిఆర్‌ఎస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులతో, గులాబి శ్రేణులతో, అభిమానులతో, పిల్లలతో కలిసి రంగులు చల్లుకుని రంగుల్లో మునిగి డోల్ బజాయిస్తూ వారితో సంతోషంగా పాల్గొని అందరిని ఉత్సాహపరిచారు. ఆయనకు స్వీట్స్ బత్తీసమాల వేసి ఆనందకేరింతలు వేస్తూ హోళీని ఉత్సాహంగ జరుపుకున్నారు. మేడ్చల్ నియోజకవర్గ నాయకులతో పాటు శామీర్‌పేట మండల మాజీ జడ్పీటిసి సభ్యురాలు ఎం.అనితలాలయ్య, బిఆర్‌ఎస్ నాయకులు వంగ వెంకట్‌రెడ్డి,పలువురు గులాబి నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా బుధవారం రెండవ రోజు కూడ ప్రజలు హోళీ పండుగను ఘనంగా జరుపుకున్నారు.



తలకొండపల్లిలో



కొందుర్గులో



కద్తాల్‌లో



సంబురాల్లో భాగంగా పాల్గొన్న యువకులు.

# చెరువులో దూకి వృద్ధుడి ఆత్మహత్య

**ఘట్‌కేసర్, మార్చి 4, ప్రభాతవార్త:** ఒంటరితనంతో జీవితంపై విరక్తి చెంది ఓవృద్ధుడు చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎంఎంసి ఘట్‌కేసర్ సర్కిల్ కార్యాలయం ఎదురుగా ఉన్న చిట్టేరుకుంటలో బుధవారం ఉదయం ఓవ్యక్తి మృతదేహం ఉందని సమాచారం రావడంతో ఘట్‌కేసర్ ఇన్స్పెక్టర్ ఎం.బాలస్వామి, ఎస్ఐ ఎ.శేఖర్ సిబ్బందితో చేరుకొని శవాన్ని బయటకు తీసి పరిశీలించారు. మృతుని జేబులో లభించిన ఫోన్‌నెంబర్ ఆధారంగా కుటుంబసభ్యులకు తెలియజేయడంతో వారు వచ్చి చూసి వివరాలు తెలిపారు. మృతుడు ఘట్‌కేసర్ డివిజన్ బ్రూక్‌బాండ్‌కాలనీకి చెందిన కోనూరి డేవిడ్ లివింగ్‌స్టోన్ అలియాస్ కిషోర్ (60)గా గుర్తించారు. మృతుడికి వివాహమై సంతానం కల్గకపోవడంతో భార్య వదిలి వేసి వెళ్లిపోయింది. కిషోర్‌కు ఒక తమ్ముడు, ముగ్గురు చెల్లెళ్లు ఉన్నారు. మృతుడు ఘట్‌కేసర్ డివిజన్ కొండాపూర్-ఎన్ఎఫ్‌సీనగర్ సమీపంలోని అమ్మనాన్న అనాద శ్రమంలో పనిచేస్తూ అందులోనే ఉంటున్నాడు. ఒంటరి తనంతో జీవితంపై విరక్తి చెంది చెరువులో పడి ఆత్మహత్య చేసుకొని ఉండవచ్చని భావిస్తున్నారు. మృతుని చెల్లెలు స్వరూపరాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామని ఘట్‌కేసర్ ఎస్ఐ ఎ.శేఖర్ తెలిపారు.

# శామీర్‌పేట పెద్దమ్మ కాలనీలో మండల సిపిఐ కార్యదర్శి పర్యటన



శామీర్‌పేటలోని పెద్దమ్మ కాలనీలో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్న మండల సిపిఐ కార్యదర్శి నరేందర్ ప్రసాద్,తదితరుల దృశ్యం

**శామీర్‌పేట, మార్చి 4, ప్రభాతవార్త:**

శామీర్‌పేట పెద్దమ్మ కాలనీలో ప్రజల సమస్యలు తెలుసుకోవటానికి శామీర్‌పేట మండల సిపిఐ కార్యదర్శి డిజి నరేందర్ ప్రసాద్ పర్యటించారు. బుధవారం శామీర్‌పేటలోని పెద్దమ్మ కాలనీలో ప్రజలకు కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్న సమాచారంతో ఆయన ఆ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ శామీర్‌పేట పెద్దమ్మ కాలనీలో మంచినీటి సరఫరా, వీధి దీపాలు, భూగర్భ మురికికాలువలు, మురికినీరు పారిశుద్యం, చెత్తా చెదారం ఉంటూ మురికికూపంగా ఉండి ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. కాలనీ బస్తీల్లో రోడ్లు సరిగ్గా లేవని, పలు ప్రజా సమస్యలు ఉండి పరిష్కారానికి నోచుకోవటం లేదన్నారు. వాటిని సంబంధిత అధికారులు అమలు చేయటం లేదని దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాలనీ ఏర్పడి సుమారు 25సంవత్సరాలు కావస్తున్నా సమస్యలు పరిష్కరించటం లేదని అన్నారు. జిహెచ్ఎంసి సంబంధిత అధికారులు,సిబ్బంది స్పందించి ప్రజా సమస్యలను పరిష్కరించాలని, వేసవి వస్తున్నందున అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. శామీర్‌పేట డివిజన్-300పరిధిలో ఉన్న ఈ పెద్దమ్మ కాలనీలో ప్రజా సమస్యలను పరిష్కరించాలని ఆయన సంబంధిత అధికారులను కోరారు.

# కుత్బుల్లాపూర్‌లో బిఆర్‌ఎస్‌కు బిగ్‌షాక్..

- మేడ్చల్ జిల్లా మత్సశాఖ కోఆపరేటీవ్ చైర్మన్ మన్నె రాజు బిఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిక

-మేడ్చల్ జిల్లా డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన వైనం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మార్చి 4, ప్రభాతవార్త:**

మేడ్చల్ జిల్లా మత్సశాఖ కోఆపరేటీవ్ చైర్మన్ మన్నె రాజు బిఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి మేడ్చల్ జిల్లా డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కుత్బుల్లాపూర్‌లో బిఆర్‌ఎస్‌కు బిగ్‌షాక్ తగిలిందని చెప్పవచ్చు. బుధవారం మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ నుంచి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలను హన్మంత్‌రెడ్డి, టిపిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి నర్సా రెడ్డి భూపతిరెడ్డిల ఆధ్వర్యంలో మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్ సమక్షంలో జిల్లా మత్సశాఖ కోఆపరేటీవ్ చైర్మన్ మన్నె రాజుకు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలో చేర్పించారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి బిఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు చైర్మన్ మన్నె రాజు పేర్కొన్నారు. ఇక మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ రాజకీయాల్లో ఈ విషయం చర్చనీయాంశంగ మారింది. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ బి.శ్రీనివాస్‌రెడ్డి, కెఎం గౌరీశ్, లక్ష్మారెడ్డి, రషీద్, బట్టపాల కృష్ణ,సిద్దనోల్ల సంజీవరెడ్డి, మైసిగారి శ్రీనివాస్, బైరీ ప్రశాంత్‌గౌడ్, ఆలేటి శ్రీనివాస్‌రరావు, ముత్యంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.




మేడ్చల్ జిల్లా మత్సశాఖ కోఆపరేటీవ్ చైర్మన్ మన్నె రాజు బిఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన దృశ్యం

# రైలు ఢీకొని మహిళ మృతి

**ఘట్‌కేసర్, మార్చి 4, ప్రభాతవార్త:** పట్టాలు దాటుతున్న ఓమహిళను రైలు ఢీకొట్టగా అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. యాదాద్రిభువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం పెద్ద పర్వతాపూర్ గ్రామానికి చెందిన గంగాల బాలమణి (59) బుధవారం ఉదయం ఘట్‌కేసర్ రైల్వేగేటు సమీపంలో పట్టాలు దాటుతుండగా బీబీనగర్ వైపు నుంచి ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్‌కు రైలు రాకను సరిగా గమనించకపోవడంతో ఢీకొట్టగా తీవ్రగాయాలై శరీరం ముక్కలుగా మారడంతో దుర్మరణం చెందింది. యాదాద్రిభువనగిరి జిల్లా భూధాన్ పోచంపల్లి మండలం మక్తాపూర్‌లోని తన చెల్లెలు దగ్గరకు వెళ్లడానికి కీసర మీదుగా వచ్చి ఘట్‌కేసర్ బాలాజీనగర్‌లో ఆటో దిగి ఘట్‌కేసర్ బస్‌టెర్మినల్‌లో బస్ ఎక్కడానికి రైల్వేట్రాక్ దాటే ప్రయత్నంలో రైలు ప్రమాదానికి గురై మృతి చెందడం స్థానికులను కలచివేసింది. ఈమేరకు సికింద్రాబాద్ జిఆర్‌పి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు. కాగా ఘట్‌కేసర్‌లో రైల్వేవంతెన నిర్మాణ పనులు జరుగుతున్న కారణంగా గేటు శాశ్వతంగా మూసివేయగా పట్టాలు దాటడానికి ఫుట్‌ఓవర్ బ్రిడ్జి లేకపోవడంతో రైలు ఢీకొని చాలా మంది మృత్యువాత పడుతున్నారు. ఎంస్ బేకరీ వీధి నుంచి గేటు అవతల ప్రజలు నిత్యం పట్టాలు దాటుతుండగా రెండు ట్రాక్‌లపై నిత్యం వందలాది రైళ్లు వేగంగా దూసుకు వెళ్తుంటాయి. పట్టాలు దాటే సమయంలో వృద్దులు, పిల్లలు, వికలాంగులు, రోగులు రైళ్ల రాకను సరిగా గమనించకపోవడంతో ప్రమాదాలబారిన పడుతున్నారు.

# ఆశ్రయ ఆకృతి సేవలు గ్రామీణ ప్రాంతాలకు విస్తరించాలి

## -జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి

**హైదరాబాద్, మార్చి 4,ప్రభాతవార్త:**

ఆశ్రయ అకృతి సంస్థ ద్వారా వినికిడి లోపంగల పిల్లలకు అందిస్తున్న సేవలు గ్రామీణ ప్రాంతాలలో కూడా విస్తరించాలని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి అన్నారు.ప్రపంచ వినికిడి దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం శ్రీనగర్ కాలనీలోగల ఆశ్రయ ఆకృతి సంస్థను అదనపు కలెక్టర్ జితేందర్ రెడ్డి తో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి మాట్లాడుతూ పిల్లలలో వినికిడి లోపాన్ని తొందరగా గుర్తించడం, ప్రారంభ దశలోనే జోక్యం చేసుకోవడం పిల్లల భాష, మాట, ఆత్మవిశ్వాసం ఎంతటి మార్పును తీసుకువ స్తుందో కలెక్టర్ వివరించారు. ఈ సేవా కార్యక్రమాలు కేవలం పట్టణ ప్రాంతాలకే కాకుండా గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాలకు కూడా మరింత విస్తరించాల్సిన అవసరాన్ని తెలియజేస్తూ, వినికిడి లోపం ఉన్న ప్రతి బిడ్డకు చేరుకునే దిశగా తన పూర్తి సహకారం ఉంటుందని, ముఖ్యంగా స్వచ్ఛంద సంస్థలు పెద్ద ఎత్తున మొబై ల్ వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వినికిడి లోపం ఉన్న పిల్లలను గుర్తించి లోపం ఉన్న పిల్లలకు వైద్య సేవలు అందించాలని సూచించారు. దివ్యాంగ పిల్లల సంక్షే మం కోసం పనిచేస్తున్న సంస్థలకు ఆర్థిక, సహాయం అందిస్తున్న దాతలు , దాతృ త్వ సంస్థలను ఈ సందర్భంగా కలెక్టర్ అభినందించారు. అలాగే పిల్లలకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధనను అందిస్తున్న తీరుపట్ల సంతృప్తిని వ్యక్తపరి చారు. పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడిన కలెక్టర్ తమ పిల్లల విద్య మరియు అభివృద్ధికి నిరంతరం ప్రోత్సాహం అందించడం జరుగుతుందని అన్నారు.